Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక : 326 పేజీలు 8 వెల : 5 గురువారం 01 మే 2025

ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా!.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| మల్టీకలర్ | బ్లాక్ & వైట్ పేజీ |
|---|---|
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఫ్రంట్ పేజీ : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

ప్రకటనదారులకు విజ్ఞప్తి...



## సింహాచలం ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ఘటనపై మంత్రులు.,అధికారులతో టెలికాన్ఫరెన్స్

సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం

మృతుల కుటుంబాలకు 25లక్షల పరిహారం ప్రకటన

ప్రమాదంపై విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ

78 గంటల్లో నివేదిక ఇవ్వాలని సిఎం ఆదేశం

ఆకాంక్షలు తీరేలా.. అమరావతి'తెలంగాణ ప్రజలు మా హైదరాబాద్, కర్ణాటక వాళ్లు మా బెంగళూరు, తమిళనాడు వాసులు మా చెన్నై అంటారు. మన రాష్ట్ర ప్రజలు కూడా మా అమరావతి అని గర్వంగా చెప్పేలా రాజధానిని నిర్మిస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు.

# జనాభా లెక్కలతోనే కులగణన




జనాభా లెక్కలతోనే కులగణన

కేంద్రకేబినేట్ కీలక నిర్ణయం

సరిహద్దు ఉద్రిక్తతలో పాటు పలు అంశాలపై చర్చ

వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

పలు రాష్ట్రాల్లో సర్వే అస్పష్టతగా ఉందని వ్యాఖ్య

న్యూఢిల్లీ,ఏప్రిల్30(ఆర్ఎన్ఎ): దేశంలో కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయించింది. జనాభా లెక్కల్లోనే కులగణను చేర్చుతామని కేంద్రం ప్రకటించింది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని, ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నేడు కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీనిసూపర్ కేబినెట్‌గా వ్యవహరిస్తారు. బుధవారం జరిగిన భేటీలో కులగణనకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించా యన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. ఇందులో పారదర్శకత లేదన్నారు. కేవలం రాజకీయకారణాలతో చేసినందున స్పష్టత లేదన్నారు. అందుకే తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. దేశ రక్షణకు సంబంధించి ముఖ్యంగా దృష్టిపెట్టిన కేంద్ర మంత్రివర్గం ఈ అంశంతో పాటు, దేశ వ్యాప్తంగా, వివిధ రాష్ట్రాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కూడా నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. జనాభా లెక్కల్లో భాగంగా కులగణన కూడా చేస్తామని కేంద్రం పేర్కొంది. పారదర్శకంగా కులగణన జరగాలని కేంద్రం భావిస్తోంది. ఇందు కోసం సర్వేలపై ఆధారపడకుండా జనాభాలెక్కలలోనే ఈ విషయం నిర్దారణ చేసుకుంటే సామాజిక సమతుల్యతకు ఆస్కారం లభిస్తుందని కేంద్రం నిర్ణయానికి వచ్చింది. వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ సర్కార్లు తీసుకొచ్చే సర్వేలు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని, దీని వల్ల సమాజ శ్రేయస్సు దెబ్బతినే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. అందుకే తదుపరి జనాభా లెక్కల్లో కుల సర్వేను కూడా చేర్చాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడిన విషయం తెలిసింది. భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. గత రెండు రోజులుగా దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో రక్షణమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో సమావేశం జరిగింది. ఇదే క్రమంలో బుధవారం భద్రతపై కేబినెట్ కమిటీ, అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది.



## క్షతగాత్రులకు మంత్రి అనిత పరామర్శ

### మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

విశాఖపట్టణం:సింహాచలం అప్పన్న సన్నిధిలో గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనతో పలు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఇక కేజీహెచ్ ఆస్పత్రిలో బాధిత కుటుంబాలను హోంమంత్రి అనిత పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.కోటి పరిహారం ప్రకటించాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. బాధిత కుటు-ంబాలు రూ.కోటి నష్టపరిహారం అడుగుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మృతుల కుటు-ంబాలకు న్యాయం జరిగేలా జిల్లాల్లోని ఎమ్మెల్యేలమంతా బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం.. కుటు-ంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పిందని తెలిపారు. అంతేకాకుండా పిల్లల్ని ప్రభుత్వపరంగా చదవిస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబాలకు అప్పగిస్తామని తెలిపారు. గోడ కూలిన ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ-వేసిందని.. 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలతో పాటు- క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అనిత హెచ్చరించారు.

## వైభవంగా దేవినేని కుమారుడి వివాహం



## గ్రూప్-1పై సింగిల్ బెంచ్ విచారణ

మార్కులు, హాల్ టిక్కెట్ వివరాలు ఇవ్వాలని ఆదేశం

విచారణ నేటికి వాయిదా



## తెలంగాణ ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్

మల్లీ మమ్మెలనే విలన్ అంటావా

ఏం చేస్తున్ఆమో..చేస్తలేమో సభకు వస్తే కదా తెలిసేది

కెసిఆర్ విమర్శలను తిప్పికొట్టిన సిఎం రేవంత్

పదేళ్లూ అధికారంలో మేమే ఉంటాం..'తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? మరో పదేళ్లు దోచుకోవడం ఆగిపోయిందన్న అక్కసుతో తెలంగాణ ఆగమైందని అంటారా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదన్నారు.





## తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు

విబజన చట్టం ప్రకారం పెంచాలన్న పిటిషనర్

విచారణ చేసి తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు

## కులగణన సర్వే చారిత్రక నిర్ణయం

కాంగ్రెస్ ఏనాడూ నిర్వహించలేక పోయింది

మోడీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు

కేంద్రమంత్రి బండి సంజయ్





## సిఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

అభినందనలు తెలిపిన మాజీ సిఎస్ శాంతికుమారి



## డిగ్రీలు వస్తున్నా... స్కిల్స్ ఉండడం లేదు

అందుకే స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం

న్యాక్ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి

# కులగణన సర్వే చారిత్రక నిర్ణయం

హైదరాబాద్: దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు- కుల గణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగబోతోందని, అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే ఈ సర్వేలో కులాల వారీగా ఎంత జనాభా ఉందో నిక్కచ్చిగా తెలుతుందని.. తద్వారా ఏ కులానికి నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్ల అమలులో న్యాయం జరిగే అవకాశముందని వివరించారు.

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ విజయమంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటని అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ కుల గణనకు వ్యతిరేకి. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఏనాడూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. జనగణన సమయంలో కూడా కులాన్ని చేర్చలేదుని.. కులగణన చేపట్టాలంటూ



2010లో దేశవ్యాప్తంగా చాలా రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తే ఈ అంశంపై మంత్రుల బృందాన్ని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. కానీ, కుల గణనకు బదులుగా సర్వే మాత్రమే నిర్వహించాలని నిర్ణయించిందే తప్ప శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించనే లేదు. కేవలం ఓటు- బ్యాంకు రాజకీయాల కోసమే కులగణన అంశాన్ని కాంగ్రెస్ లెవనెత్తుతుందే తప్ప ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. మోడీ సర్కార్ నిర్ణయం కాంగ్రెస్ ఘనతే అయితే డూప్లికేట్ గాంధీల ఏలుబడిలో కులగణన ఎందుకు చేయలేదో సమాధానం రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.

తెలంగాణసహా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన ఈ కులగణన సర్వేలో పారదర్శకత లేనేలేదని అన్నారు. రాజకీయ లబ్ది కోసమే సర్వేలు నిర్వహిస్తూ తమకు అనుకూలమైన కులాల జనాభా పెంచుతూ, ఇతర కులాల జనాభాను తగ్గించే చూపే ప్రయత్నం చేశాయని.. తద్వారా సమాజంలో కులాల మధ్య కుమ్మలాటలు, అస్థిర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ- రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని ఈరోజు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కేంద్ర నిర్ణయాన్ని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, కుల సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు స్వాగతిస్తూ సహకరించాలని విజ&ఝప్తి చేస్తున్నట్లు- తెలిపారు.

## నగర పోలీసు కమిషనరేట్ పునః వ్యవస్థీకరణ

హైదరాబాద్: హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పునః వ్యవస్థీకరణలో భాగంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త నిర్ణయాలు, వాటి వివరాలను నగర పోలీస్ కమిషన్ సివి ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ ను 35 సంవత్సరాల తర్వాత పోలీసు పునః వ్యవస్థీకరణ చేయడానికి ఉత్తర్వులు చేసారు. ఈ క్రమంలో పలువురు సిఐలను భారీగా బదిలీ చేశారు. కొత్త ఉత్తర్వుల ప్రకారం రెండు అదనపు లా అండ్ ఆర్డర్ జోన్‌లు (సౌత్ ఈస్ట్,సౌత్ వెస్ట్), 11 కొత్త లా అండ్ ఆర్డర్ డివిజన్‌లు, ఒకటి అదనపు ట్రాఫిక్ జోన్ (ట్రాఫిక్ 3), మరో 11 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 71), 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 31) ఏర్పాటు చేసినట్లు- తెలిపారు. అలాగే నగరంలో ఉన్న 7 జోన్‌లకు 7 మహిళా పోలీస్ స్టేషన్‌లతో మహిళా భద్రతా విభాగం, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్, ఐటీ- వింగ్, నార్కోటిక్స్ వింగ్ ఏర్పాటు చేసారు. ఈ మార్పుల కోసం అదనంగా 1200 మంది సిబ్బందిని మంజూరు చేసారు. గత 2 సంవత్సరాలుగా, పోలీసు స్టేషన్ హద్దులపై అలాగే కొత్త పోలీస్ స్టేషన్‌లకు వెళ్లడంలో ఎదురవుతున్న సమస్యలపై ప్రజల నుండి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసులకు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు కొన్ని ప్రాంతాలలో అధికార పరిధిపై గందరగోళం ఉండటం, సైబర్ క్రైమ్ వింగ్‌ను మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందని చర్చించి నివేదించడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మొత్తం హైదారాబాదు సిటీ పోలీసుకు మంజూరైన 17,020 మంది సిబ్బందిని అంతర్గత సర్దుబాటు, పునః కేటాయింపులు మార్పులతో ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మార్పుల వలన రాబోయే పదేళ్ల వరకు హైదరాబాద్ నగర పోలీసులు బాగా పనిచేయటానికి అనుకూలంగా ఉంటుందని సిపి తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు పరిధిలో 72వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌గా టోలిచౌకి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసారు. ఇంతకు ముందు ఉన్న ఫిల్మ్‌నగర్ పిఎస్, మెహదీపట్నం పిఎస్ , గోల్కొండ పిఎస్ పరిధిలో ఉన్న కొన్ని ప్రాంతాలను ఇప్పుడు కొత్తగా ఏర్పాటు- చేసిన టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చారు. స్థానిక ప్రజలు తొందరగా గుర్తు పట్టడానికి వారికి అనువుగా ఒకటి లా అండ్ ఆర్డర్ డివిజన్ పేరు, మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లకు స్థానికంగా ప్రసిద్ధి చెందిన అలాగే స్థానిక సూచనలను ప్రతిబింబించేలా పేర్లు మార్చారు. గోల్కొండ డివిజన్‌ను ఇప్పుడు టోలిచౌకి డివిజన్ గాను, సెక్రటేరియట్ పిఎస్‌ను లేక్ పిఎస్‌గా ను, హుమాయున్ నగర్ పిఎస్‌ను మెహదీపట్నం పిఎస్ గాను, షాహినాయత్ గంజ్ పిఎస్‌ను గోషామహల్ పిఎస్‌గా పేరు మార్చారు.

లా అండ్ ఆర్డర్ డివిజన్ల ప్రకారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల హద్దులు ఉండాలని ప్రస్తుతము ఉన్న మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను తీసేశారు. ఆగాగే ప్రస్తుతం ఉన్న లా ఆండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల పరిధి ప్రకారం వాటికి సంబంధించిన ఏరియాల్లో పనిచేయడానికి ట్రాఫిక్ నాంపల్లి పీఎస్, ట్రాఫిక్ అంబర్‌పేట్ పీఎస్, ట్రాఫిక్ లంగర్ హౌస్ పీఎస్, ట్రాఫిక్ బహదూర్‌పుర పీఎస్, ట్రాఫిక్ నల్లకుంట పీఎస్‌ల పేర్లు మార్చి ట్రాఫిక్ గాంధీ నగర్ పీఎస్, ట్రాఫిక్ ఉస్మానియా యూనివర్సిటీ- పీఎస్, ట్రాఫిక్ కుల్సుంపుర పీఎస్, ట్రాఫిక్ ఛత్రినాకా పీఎస్, ట్రాఫిక్ సైదాబాద్ పీఎస్ లుగా పేర్లు మార్చారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏర్పాటు చేసారు. ఇందుకోసం ఒక ఇన్స్పెక్టర్, 8 సిబ్బంది

ఏర్పాటు- చేయగా.. జువెనైల్ బ్యూరో యూనిట్ కు – ఒక ఇన్స్పెక్టర్ తో 7 మంది సిబ్బంది ఉంటారు అని తెలిపారు. అలాగే ప్రతి లా అండ్ ఆర్డర్ జోన్‌లో ఒక సైబర్ క్రైమ్ సెల్‌లను ఏర్పాటు- చేసారు. ప్రస్తుత, భవిష్యత్ పోలీసింగ్ అవసరాలకు తగిన విధంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు మంజూరైన సిబ్బంది సంఖ్యతో బలోపేతం చేశారు. పునర్వ్యవస్థీకరణలో జరిగిన మార్పులు అధికార పరిధి పటాలు, సంప్రదింపు, పోలీసు స్టేషన్ వివరాలు, పోలీస్ స్టేషన్ స్థానాలు త్వరలో హైదరాబాద్ సిటీ- పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచబడతాయని ఆనంద్ తెలిపారు.

## గ్రూప్-1పై సింగిల్ బెంచ్ విచారణ

హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం సైతం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. వరుస హాల్‌టికెట్ల వారికి ఒకే మార్కులు వచ్చాయని, నిర్దేశించిన సమయానికి ప్రొవిజనల్ మార్కుల జాబితా ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. 20 రోజుల తర్వాత తుది మార్కులు వెల్లడించారని, ఆ 20 రోజుల్లో అవకతవకలు జరిగాయనే అనుమానంగా ఉందన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. మూల్యాంకన పక్రియ గురించి టీజీపీఎస్సీని వివరాలు అడిగి తెలుసుకుంది. తెలుగులో రాసిన అభ్యర్థులకు ఎలా మార్కులు వేశారని ప్రశ్నించింది. తెలుగులో రాస్తే తక్కువ మార్కులేశారన్న ఆందోళన ఉంది. జవాబులకు సంబంధించి ఏదైనా కీ పేపర్ ఉంటుందా? తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల కీ ఇచ్చారా?' అంటూ టీజీపీఎస్సీకి ప్రశ్నలు సంధించింది. కాగా.. కమిషన్ స్పందిస్తూ ఎవాల్యుయేటర్లకు ఎలాంటి కీ ఇవ్వలేదని తెలిపింది. రాతపూర్వక పరీక్ష కావడంతో కీ ఇవ్వడం కుదరదని, జవాబు పత్రాలు దిద్దిన వారు ఆయా సబ్జెక్టుల్లో నిపుణులని కోర్టుకు వివరణ ఇచ్చింది. అయితే, తెలుగులో ఎంతమంది రాశారో, ఎంత మంది ఎంపికయ్యారో వారి వివరాలు ఇవ్వాలని టీజీపీఎస్సీని కోర్టు ఆదేశించింది. ఈ పరీక్షతోపాటు- గత గ్రూప్-1 అభ్యర్థుల సమాచారం కూడా ఇస్తామని టీజీపీఎస్సీ తెలిపింది. చాలా ఏళ్లుగా నిరుద్యోగులు గ్రూప్ - 1 కోసం ఎదురుచూస్తున్నారని, ఆలస్యం లేకుండా విచారణ ముగించాల్సి ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## వైభవంగా దేవినేని కుమారుడి వివాహం





విజయవాడ: తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారు కంకిపాడులో జరిగిన ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్ తో పాటు- తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. రేవంత్, మంత్రి నారా లోకేశ్ కలిసి వివాహ వేడుక వద్దకు వచ్చారు.

## తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు

న్యూఢిల్లీ:తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి, తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని సెక్షన్ 26 ప్రకారం, ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కె. పురుషోత్తమ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టం ప్రకారం, రెండు రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల, రాజకీయ ప్రాతినిధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల సంఖ్యను సమీక్షించి పెంచాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా ఈ నిబంధన అమలు కాకపోవడంతో ఈ పిటిషన్ దాఖలైంది.

డాక్టర్ పురుషోత్తమ్ రెడ్డి తన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సెక్షన్ 26ను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రానికి, ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ విషయంపై గతంలో కూడా సుప్రీంకోర్టులో చర్చలు జరిగినప్పటికీ, తాజా విచారణ అంశం చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విస్తృతంగా వాదనలు చేసింది. పిటిషనర్ తరపున వాదిస్తూ, రెండు రాష్ట్రాల్లో జనాభా వృద్ధి, భౌగోళిక అవసరాల ఆధారంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచడం తప్పనిసరి అని ప్రస్తావించారు. ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ సీట్లు-, తెలంగాణలో 119 సీట్లు- ఉన్నాయి. ఈ సంఖ్యను పెంచితే, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, రాజకీయ ప్రాతినిధ్యం మరింత సమర్థవంతంగా ఉంటుందని వాదించారు. కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు విన్న ఎన్నికల సంఘం తమ స్థానాన్ని సమర్థించుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం, 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని వారు వాదించారు. అంతకుముందు సీట్ల పెంపు కోసం రాజ్యాంగ సవరణ అవసరమని, ఇది సంక్లిష్టమైన పక్రియ అని పేర్కొన్నారు.

## తెలంగాణ ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్

హైదరాబాద్: భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ఇలా ఎప్పుడూ చేయలేదన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలపై సీఎం దీటుగా స్పందించారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు కేసీఆర్ చెబుతున్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రజాపాలన ఆగిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? అని మండిపడ్డారు. విప్లవకారుడు అంటే తుపాకీ పట్టుకోవాల్సిన అవసరం లేదని, విప్లవాత్మక మార్పు తెచ్చే ఎవరైనా విప్లవకారుడని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ పై బసవేశ్వరుడు ప్రభావం ఎక్కువని సీఎం అన్నారు. ప్రభుత్వ తప్పిదాలు సరిదిద్దేలా ప్రతిపక్ష వ్యవస్థ ఏర్పాటు- చేసుకున్నామని అలాగే, ప్రజల అభివృద్ధి జీవన ప్రమాణాలు పెంచేలా రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్నట్లు- ఆయన తెలిపారు. శాసన సభలో సభ నాయకుడిగా నేను, మంత్రులం అంతా పాల్గొన్నామని తెలిపారు. అయితే, నిన్నగాక మొన్న ఒకాయన వరంగల్ లో సభ పెట్టిండని, అయితే మాకేం అభ్యంతరం లేదన్నారు. ఇక సభకు ఎన్ని వందల బస్సులు అడిగితే అన్ని ఇవ్వండి అని మంత్రి పొన్నంకి చెప్పానని, అధికార పక్షమే కాదు.. ప్రతిపక్ష పార్టీ కూడా ఉండాలని అందుకు సహకరించామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అయితే, సభలో ప్రజల సమస్యలు ఏదైనా ప్రస్తావించారా..? మా లోపాలు చెప్పినవా..? మంచిని అభినందించావా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుండి జీత భత్యాలు తీసుకుంటు- న్నారు.. ఏ చట్టంలో ఉన్నది, జీతాలు తీసుకుని పని చేయడం అని అంటూనే.. అన్ని వసతులు అనుభవిస్తూ, ప్రతిపక్ష పాత్ర పోషించకపోతే ఎలా అంటూ మండి పడ్డారు. అసెంబ్లీకి తాను రాను.. పిల్లల్ని పంపిస్తా అంటాడని సీఎం పేర్కొన్నారు. అయితే, మీరెందుకు మరి ప్రతిపక్ష నాయకుడిగా ఉండటం..? మీకు ఎక్కడిది మమ్మల్ని అడిగే హక్కు. ప్రతిపక్ష హోదా నీకు ఎందుకు? ఫార్మ్ హౌస్ లో పడుకుని ఏం సందేశం ఇస్తున్నారు? అధికారంలో ఉంటే చెలాయిస్తాం.. లేదంటే అసెంబ్లీకే రాను అంటే ఎట్లా? మేము ఇచ్చినవి అగినయి అంటున్నావు.. ఏమి అగినయని సీఎం ప్రశ్నించారు .మీరు సభకు రారు... కాబట్టి మేం ఏం చేస్తున్నామో ఎట్లా తెలుస్తుంది? మీరు ఏ మత్తులో జోగుతున్నారో తెలియదు.. విద్వేష పూరిత ప్రసంగం చేసి.. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారాని సీఎం రేవంత్ ఆగ్రహించారు. పదేళ్లు మేమే అధికారంలో ఉంటాము.. అదే పదేళ్లు ఫార్మ్ హౌస్ లోనే ఉంటావు.. తర్వాత నీ చరిత్ర ఫార్మ్ హౌస్ లోనే పరిసమాప్తం అంటూ ఎద్దేవా చేసారు. మీ కుటుంబం పదేళ్లు దోచుకోలేదా..? దేని మీద చర్చ చేద్దామో చెప్పు, సభ పెడదాం రా.. ప్రతిపక్ష నాయకుడిగా నిర్ణయాల్లో తప్పులు ఉంటే చెప్పండి సరిదిద్దుకుంటామని సీఎం మాట్లాడారు. అలాగే విషం చిమ్మే మాటలు వద్దు, ఆయన మాటల్లో, కండ్లల్లో విషం.. విచక్షణ ఉండాలి కదా... ఏం మాట్లాడుతున్నామో అని అన్నారు. మేము తెలంగాణ ఇస్తే.. పదేళ్లు దోచుకుని మమల్ని విలన్ అంటున్నావని ఫైర్ అయ్యారు. ప్రజలు అనాలి.. మీరు తెలంగాణ ఇస్తే... ఆయన ఆగం చేశారని మమ్మల్ని అనాలి, నువ్వు కాదని సీఎం అన్నారు.



## సిఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

**అభినందనలు తెలిపిన మాజీ సిఎస్ శాంతికుమారి**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఎస్ శాంతి కుమారి పదవీవిరమణ చేయడంతో.. రామకృష్ణారావును ప్రభుత్వం నూతన సిఎస్ గా నియమించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఆయన తన సర్వీసులో నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా, 2016 నుంచి ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. 2021 నుంచి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కుడ్లిగి రామకృష్ణారావు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సిఎస్ శాంతికుమారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. కొత్త సిఎస్‌కు ఆమె అభినందనలు తెలిపారు.

## డిగ్రీలు వస్తున్నా...స్కిల్స్ ఉండడం లేదు

హైదరాబాద్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి డిగ్రీ తీసుకొని బయటకు వచ్చిన యువతకు స్కిల్స్ ఉండటం లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన చెందారు. యువతలో స్కిల్స్ పెంచేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని అందు కోసమే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ న్యాక్ లోబుదవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కోమటి రెడ్డి ముఖ్య అథిదిగా హాజరయ్యారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీ÷-న్ ను, సోలార్ రూఫ్ టాప్, స్పేస్ అకాడమీ డబ్బింగ్ స్టూడియో ను, సి ఎస్ ఆర్ కింద ఐసీఐసీఐ బ్యాంక్ ఏర్పాటు చేసిన 100 కె వి సోలార్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. సినిమా కోర్సులు నేర్చుకున్న 22 మంది బ్యాచ్ కు ఆయన సర్టిఫికెట్ లు అందచేశారు. ఈ సందర్భంగా కోమటి రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగుమే పెద్ద సమస్యగా మారిందని, ఉద్యోగాలు లేక యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతుందని అన్నారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు యువతకు వివిధ రంగాలలో స్కిల్ యూనివర్సిటీ- శిక్షణ ఇస్తుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కి సీఎం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళలకు ఇళ్ళ నిర్మాణంలో మెస్త్రి ట్రైనింగ్ ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ళ స్కీమ్ కింద చేపట్టే నిర్మాణాలు వారితోని చేయిస్తున్నామని కోమటిరెడ్డి అన్నారు. సినిమా టెక్నీషియన్ కు న్యాక్ లో శిక్షణ ఇస్తామని ఈ విషయంలో త్వరలో దిల్ రాజు , సినిమా వాళ్ళ తో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్నారు. నల్గొండ లో స్కిల్ -ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు- చేశామని ప్రతి ఏటా 10 వేల మందికి -ట్రైనింగ్ ఇస్తూ 100 శాతం జాబ్ ప్లేస్ మెంట్ కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. న్యాక్ ఎండి ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రటరీ హరించందన మాట్లాడుతూ స్కిల్ -ట్రైనింగ్ అనేది డిగ్రీ కాదని ఇది ఒక కోర్స్ అనే విషయం గమనించాలని నిత్యం స్కిల్స్ నేర్చుకుంటూ ఉండాలని అన్నారు. గత ఏడాది లో వివిధ కోర్స్ లో 25 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చామని ఈ సంఖ్య ను రానున్న రోజుల్లో పెంచు తమని హరిచందన అన్నారు. ఇందులో 99 శాతం మందికి పెద్ద కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో 10 ఉమ్మడి జిల్లా లో న్యాక్ రీజనల్ కేంద్రాలు

# సింహాచలం ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

అమరావతి: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలచివేసిందన్నారు. భారీ వర్షాలతో గోడ కూలడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. మరణించిన

వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్కడి పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడినట్లు చెప్పారు. గాయపడిన వారికి చికిత్స అందించాలని ఆదేశించామన్నారు. సహాయకచర్యలపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి కేజీహెచ్‌కు వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు పోలీసులు భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మరోవైపు సింహాచలం ఘటన పై మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు



టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు, గాయపడిన వారికి రూ.3లక్షల చొప్పున పరిహారం అందజేయాలని సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రులు అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవస్థాన అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయంపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆయన ఆదేశించారు. మరోవైపు గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలిగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. సింహాచలం ఘటనపై ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశానికి డీజీపీ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఘటన జరిగిన తీరు, బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై విచారణకు ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ-లో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ వెంకటేశ్వరరావును సభ్యులుగా చేర్చారు. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక అందజేయాలని కమిటీని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018
ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

# సంపాదకీయం

## కార్మికుల స్వేదానికి వెలకట్టని చట్టాలు !

మేడే అనగానే గుర్తుకు వచ్చేది కార్మిక వర్గమే. వారు లేనిదే పరిశ్రమలు లేవు..జీవనం లేదు.. అయినా ఏటా మేడేలు జరుపుకుంటున్నా వారిని ఆదరించే తీరులో మాత్రం చిత్తశుద్ధి కానరావడం లేదు. వారిని నేటికి బానిసలు గానే చూస్తున్న తీరు దారుణం. కార్మిక వర్గాన్ని అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. చట్టాలు పరిశ్రమల యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్నాయి. కనీస వేతనాలు, అమలు కావడం లేదు. పనిదినాలు, పనిగంటలు అన్నవి లేకుండా పోతున్నాయి. దేశంలో కార్మికులను అణచివేసే రాక్షస యాజమాన్యాలకే ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయి. వారికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్న కారణంగా, కార్మికసంక్షేమం అన్నది మేడిపండు చందంగా మారింది. కార్మికుల పోరాటాల్లో నుంచి మేడే పుట్టినా...నిత్యం వారికే అన్యాయం జరుగుతోంది. వారినే యాజమాన్యాలు చులకన చేస్తున్నాయి. ఏటా మేడేలు జరుపుకుంటున్నా స్వేదం చిందిస్తున్న కార్మికులను ఇంకా బానిసలుగా చూస్తున్న ఘటనలు కోకొల్లలు. ముఖ్యంగా కార్పొరేట్ రంగం విస్తరించిన తరవాత కార్మికుల జీవితాలకు, జీతాలకు విలువ లేకుండా పోయింది. ప్రధానంగా పనిదినాలు, పనిగంటలు అన్నవి మృగ్యం అయ్యాయి. నిబంధనల మేరకు అనే పద్దతి పోయింది. కంపెనీల నిబంధనల మేరకు పనిచేయాల్సి వస్తోంది. కార్మికచట్టాలు అన్నీ చూడడానికి ఉన్నా, అమలు మాత్రం కావు. ఏవైనా ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు. ఇకపోతే శ్వేదం చిందిస్తూ మిద్దెలు,మేడెలు కడుతున్నా..వారికి కనీసం గూడు ఉండడం లేదు. వారి పిల్లలకు చదువూసంధ్యా దక్కడం లేదు. వ్యవసాయం నుంచి అన్నిరంగాల్లో వారి చెమట లేకుండా ఏ పనీ జరగడం లేదు. సర్వసంపదలు సృష్టించే శ్రామికవర్గం అన్నది గుర్తింపు లేకుండా పోయింది. శ్రమజీవులు ప్రపంచ వ్యాప్తంగా తమ సత్తా ఏమిటో చాటారు.కార్మికులు తమ స్వేదాన్ని రక్తంగా చిందించి లాభాలు తెచ్చి పెడుతున్నా, నేటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు.ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక హక్కులు సాధించుకున్నా.. నేటికీ అవి అమలు కావడం లేదు. 8 గంటల పని హక్కు కోసం ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచి పని గంటల హక్కు సాధించారు. తమ హక్కుల సాధన కోసం వందలాది మంది ప్రాణాలు అర్పించారు. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. తమ డిమాండ్లపై నినదించిన వారిని తక్షణం ఉద్యోగాల నుంచి తొలగస్తున్నారు. ఉద్యోగాలు తొలగించినా... నోటీసులు ఇవ్వకున్నా కార్మిక సంక్షేమ శాఖ చూసీచూడనట్లుగా ఉంటోంది. ఇకపోతే మరీముఖ్యంగా ఆడవాళ్లు వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తమపై అధికారులు వారిని సెక్స్ బానిసలుగా చూస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం దీని ఇంకా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే కార్మికుల పిల్లలకు విద్యా,ఉద్యోగ సౌకర్యాల కల్పన లేదు. వారికి ఆరోగ్య సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. అలాగే అర్థాంతరంగా కంపెనీలను, సంస్థలను మూసేసి కార్మికలు నోట్లో మట్టికొడుతున్నా కార్మిక చట్టాలు పనిచేయడం లేదు. నేటికీ ఇంకా ఫ్యూడల్ భావాల నుంచి యాజమాన్యాలు బయటపడడం లేదు. మారిన ప్రపంచ పటంలో మారుతున్న కాలంలో ఇంకా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. కార్మికులను అణచివేసేందుకు యాజమాన్యాలు కొత్తకొత్త పద్దతులను అనుసరిస్తున్నాయి. యాజమాన్యాలకు వత్తాసు పలికే బూర్జువా విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి. అప్పుడే మేడేకు సార్థకత చేకూరుతుంది. పారిశ్రామికీకరణ తరవాత కూడా మార్పులు రావడం లేదు. కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్న యాజామన్యాలకు అనుగుణంగా చట్టాలు తీసుకుని రావడం దారుణం. ఈ పరిస్థితులనుంచి బయటపడాలి. పక్కాగా శ్రామిక చట్టాలు అమలు చేసి వారికి అండగా నిలవాలి. కార్మిక హక్కులు, పోరాటాలు, త్యాగంతోనే సాధ్యం అయ్యాయి. కానీ ప్రభుత్వాలు కార్పోరేట్ కంపెనీల మోచేతి నీళ్లు తాగుతూ..కార్మికులకు ద్రోహం చేస్తున్నాయి. ఇవాళ మనం చూస్తున్న ఈ ప్రపంచం, అభివృద్ధి అంతా కూడా కార్మికుల శ్వేదం చిందిస్తేనే సాధ్యం అయ్యిందన్న విషయం మరచిపోతున్నాం. కార్మికవర్గం లేకుంటే తమకు పురోగతి లేదన్న భావనలో లేరు. పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో కార్మికులను బానిసల వలే పని చేయించారు. కార్మికులు రోజుకు 16 నుంచి 20 గంటల వరకు పని చేసేవారు. అయితే చైతన్యం పెరగడంతో మెల్లగా 19వ శతాబ్దం ప్రారంభం నుంచి కార్మికులు తిరుగుబాట్లు ప్రారంభించారు. ఆనాడు కార్మికులకు ఎటువంటి భద్రత గాని, సౌకర్యాలు గాని వుండేవి కాదు. ఫ్యాక్టరీల్లో గాలి, వెలుతురు సౌకర్యాలు మృగ్యం. కార్మికులకు యంత్రాల నుండి రక్షణ లేదు. తరచుగా ప్రమాదాలకు గురై మరణించే వారు. కార్మికులు అమానుష శిక్షలకు గురవుతుండేవారు. కార్మికులు తమ పీడనకు వ్యతిరేకంగా యంత్రాలను ధ్వంసం చేసేవారు. ఈ విధ్వంసకాండ బ్రిటన్‌లో ప్రారంభమైంది. యంత్రాలను విచ్ఛిన్నం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ బ్రిటన్‌లో చట్టం చేసారు. ఈ దుస్థితి నుంచి బయట పడడానికి పోరాటం సల్పడం ఒక్కటే మార్గమని కార్మికవర్గం అర్థం చేసుకుంది. కార్మిక వర్గం చైతన్యవంతంగా వున్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభ మైంది. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియా కార్మికులు సమ్మె చేశారు. ఫిలడెల్ఫియా నగరంలో 'మెకానిక్స్ యూనియన్' పేరుతో కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు సంఘాలను నిర్మించుకొని పోరాటాలు సాగించారు. ట్రేడ్ యూనియన్ల మహత్తర శక్తిని చూసి పాలకులు హడలెత్తిపోయారు. 1886 చికాగో కార్మికుల పోరాటం,884 అక్టోబర్‌లో అమెరికా, కెనడాల ఆర్గనైజ్డ్ ట్రేడ్ అండ్ లేబర్ యూనియన్ల నాలుగవ మహాసభ జరిగింది. 1886 మే నుండి

8 గంటల పని చట్టబద్ధమైన పనిదినంగా వుంటుందని తీర్మానం చేసింది. మే 1వ తేదీన సమ్మె చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. 'మనిషి జీవితంలో రోజులో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల దినచర్య' అనే శాస్త్రీయ పద్ధతి కోసం పోరాడాలని నిర్ణయించారు.

ఈ పిలుపుకు అశేషమైన స్పందన వచ్చింది. వేలాది మంది కార్మికులు అనేక సంస్థలు '8 గంటల పని దినం' కోసం మే1వ తేదీన సమ్మెలో పాల్గొన్నారు. 1889లో ప్యారిస్‌లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మేడేను అంతర్జాతీయ కార్మికదినంగా అమలు చేయాలని తీర్మానాన్ని రూపొందించింది. అప్పటి నుంచి మేడేను అధికారికంగా కార్మికలోకం జరుపుకుంటోంది. ఆతరవాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కార్మికవర్గ కార్యక్రమాలు బాగా పెరిగాయి. ఈ అనుభవాను గుర్తించినా రానురాను ఈ ఆధునిక యుగంలో కార్పోరేట్ కంపెనీలన్నీ ప్రభుత్వాలతో కుమ్మక్కయి కార్మికులను అణచి వేస్తున్నారు. ఈ క్రమంలో మరో కార్మికోద్యమానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మేల్కొని అప్రమత్తంగా ఉండకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

# ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,230 మంది ఎన్టీఆర్ భరోసా

**ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,230 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ దారులకు సూమారు 111.84 కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు మే నెల, 2025 ఒకటవ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ కి సర్వం సిద్ధం జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్**



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఏప్రిల్,30:**

ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,230 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ దారులకు సూమారు 111.84 కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు మే నెల, 2025 ఒకటవ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ కి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు మే 1 వ తారీఖున పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధికారులకు టెలికాన్ఫరెన్స్, వర్చువల్ విధానంలో మంగళవారం సూచిస్తూ మే 1 వ తారీఖున గురువారం పంపిణీ చేయవలసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ మొత్తాన్ని ఈ నెల ఏప్రిల్ 30 బుధవారం నాడే సంబంధిత అధికారులు డ్రా చేసి సేఫ్ కస్టడీ లో ఉంచుకొని, మే 1 వ తారీఖున సిబ్బంది అందరూ ఉదయం 6.30 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేయుట కొరకు వారి పంపిణి ప్రదేశాలకి చేరుకొని ఉదయం 6.30 గం లకు యాప్ ఓపెన్ అయ్యాక పింఛను దారులకు పింఛన్లు పంపిణి చేపట్టాలని సూచించారు.మే 1 వ తేదీన ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ పింఛనుదారు ఇంటి నుండి ఖచ్చితంగా 300 మీటర్ల పరిధి దాటితే పని చేయదని, పింఛనుదారుల ఇంటివద్దనే పింఛను ఇవ్వాలని, ఏ కారణం చేతనైనా ఇంటివద్ద ఇవ్వడం కుదరకపోతే తగిన కారణాలను యాప్ నందు నమోదు చేయవలయునని తెలియచేసారు. పింఛను దారులకు ముందుగా నమస్కారం పెట్టి గౌరవంగా చిరునవ్వు తో పింఛను పంపిణీ చేయవలయునని ఆదేశించారు. ఏ కారణం చేతనైనా పింఛను తీసుకోని లబ్ధిదారులకు వారి యొక్క చరవాణి కి సందేశం పంపబడుతుంది. వీరికి 02.05.2025 తేదీ మధ్యాహ్నం 02.00 గం.ల నుండి 05.00 గం.ల వరకు గ్రామ/వార్డు సచివాలయంలో సంబంధిత %ూూ/ఔజూూ, ఔఔణూ/ఔూూ% వీరికి పించను మొతాన్ని తప్పనిసరిగా పంపిణి చేయవలెను. జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,230 మంది ఫించన్ దారులకు సుమారు 111.84 కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నామని, గురువారం అదే రోజు 100 శాతం ఫించన్ల పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా ఎంపీడీఓ మరియు మునిసిపల్ కమీషనర్లు పింఛను పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. మే నెల 1 వ తేదీన పెన్షన్ ఇస్తున్న విషయం ప్రతి ఫించన్ దారునికి వ్యక్తిగతంగా తెలియచేయాలని, అలాగే ఫించన్ పంపిణీకి నిర్దేశించిన సిబ్బంది ఉదయం వారి పంపిణీ ప్రదేశానికి ఉదయం 6.30 గం.ల లోగా చేరుకుని తప్పకుండా ఆరోజు ఉదయం 7.00 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎక్కడ కూడా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పెన్షన్ పంపిణి చేయు అధికారి పెన్షన్ దారులతో గౌరవ ప్రదంగా వ్యవహరించాలని, అవినీతికి పాల్పడరాదని మరియు ఇంటి వద్దనే ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయవలెనని తెలియజేశారు. ఎవరైనా దీనిని అతిక్రమించినచో క్రమశిక్షణా చర్యలు తీసుకోబడునని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అలాగే గత నెలలో ఏదేని కారణంతో ఫించన్ తీసుకోని వారికి ఈ నెల పించన్ మొత్తంతో కలిపి పంపిణీ చేయాలని అన్నారు. కావున ఈ సమాచారం అందరికి తెలియచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, మునిసిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఫించన్ దారులకు అందరికీ %×ఎ=ూ% విధానం పై వ్యక్తిగతంగా తెలియచేయాలని అన్నారు.

మరియు వితంతు పించన్లకు(%ంజూశీబంవ%)సంబంధించిన జాబితాలో అర్హులవి ఎవరిదైనా తమ పేరు రానిచో సంబందిత మండల/మునిసిపల్ కార్యాలయాల్లో తగిన ధ్రువపత్రాలు సమర్పించవలెను. వీటిని ధ్రువీకరించి ఎంపిడిఓ / మునిసిపల్ కమిషనర్ లేఖ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు పంపిన యెడల సెర్ప్ కార్యాలయానికి పంపడం జరుగుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# 10 లక్షల రూపాయల నిధులతో పార్కు అభివృద్ధి

**ప్రకాశం మునిసిపల్ పార్క్, వాకర్స్ మజ్జిగ మాసోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఏప్రిల్ 30,**

ఎన్నికలకు ముందు ప్రచారంలో తాను ముందుగా ప్రకాశం మున్సిపల్ పార్కులో వాకర్స్ తో కలిసి నడుస్తూ ప్రచారాన్ని మొదలు పెట్టానని, ఇది ఎప్పటికి తాను మరిచిపోలేనని, ఇక్కడ వాకర్స్ కావలసిన సదుపాయాలను కల్పించడం 10 లక్షల రూపాయల నిధులతో పనులు చేపడతామని తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు వెల్లడించారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలి అంటే ప్రతినిత్యం నడక తప్పనిసరిగా చేసుకోవాలని ఆయన సూచించారు. నెల రోజులుగా ప్రకాశం మున్సిపల్ పార్కులో వాకర్స్ అసోసియేషన్ తరపున వాకర్స్ సభ్యులకు వేసవితాపం దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ అంబలి వితరణ కార్యక్రమాలు. నెలరోజుల నుంచి దాతల సహాయంతో వాకర్స్ అసోసియేషన్ నాయకులు వితరణ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మజ్జిగ పంపిణి వితరణ నెలరోజులు పూర్తిచేసుకుని బుధవారం ముగింపు చేస్తున్న సందర్భంగా అతిథిగా తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ నాయకులు వాకర్స్ ఆరోగ్య శ్రేయస్సు కొరకు మెడికల్ క్యాంపులు, ఉచిత రక్తపరీక్షలు లే కాకుండా వేసవితాపాన్ని వాకర్స్ కు మజ్జిగ, అంబలి నెలరోజులుగా నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. అంతేకాక పార్క్ అభివృద్ధి కొరకు ప్రభుత్వనిధులతో పనులు చేపడతామన్నారు. బెల్లంకొండ సురేష్ తో పాటు కార్యక్రమంలో పాల్గొన్నందుకు వారందరికీ కూడ అభినందనలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపినాథ్ , కార్యదర్శి చంద్రకాంత్ , కోశాధికారి గురునాథం, ఉపకార్యదర్శి మస్తాన్ , ఉపాధ్యక్షులు జగన్నాధం, దాసు, మునిరత్నం, బలరామిరెడ్డి , సుబ్బయ్య ,

రాజేశ్వరి , వెంకటరామి శెట్టి, మాయావి దినపత్రిక ఎడిటర్ కోలా లక్ష్మీపతి , మధు, భక్తవత్సలం, వెంకటముని, బుజ్జి, చిన్ని , ఎర్రమరెడ్డి, శంకరయ్య తదితర సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.


# సింహాచలం అప్పన్నకు టీటీడీ చైర్మన్ పట్టువస్త్రాల సమర్పణ



**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 30.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన విశాఖపట్నం సమీపంలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారికి(అప్పన్న) టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు బుధవారం పట్టువస్త్రాలు సమర్పించారు.టీటీడీ 1996వ సంవత్సరం నుంచి టీటీడీ తరుపున శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. దేశంలోని అన్ని నరసింహస్వామి క్షేత్రాల్లో సింహాచలం అతి ప్రాచీనమైనదని, స్వామివారు ఇక్కడ స్వయంభువుగా వెలిశారు.సింహగిరిపై కొలువైన సింహాద్రి అప్పన్న చందనోత్సవం వేకువజామున వైభవంగా ప్రారంభమైంది. సింహాచలం అప్పన్న విగ్రహం ఏడాది పొడవునా చందనంతో కప్పి ఉంటుంది. సంవత్సరంలో 12 గంటలు మాత్రమే చందనం పూత లేకుండా స్వామివారు దర్శనమిస్తారు. పవిత్రమైన అక్షయతృతీయ రోజున స్వామివారి విగ్రహానికి చందనం పూత తొలగించి తిరిగి పూస్తారు. చందన యాత్ర లేదా చందనోత్సవం పేరిట ప్రతి ఏటా వైశాఖమాసంలో ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవేంకటేశ్వరస్వామివారి తరపున టీటీడీ చైర్మన్ పట్టువస్త్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, బొక్కసం ఇన్ ఛార్జ్ శ్రీ గురు రాజ్ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# ట్యూషన్ టీచర్ నిర్వాకం.. లక్షల్లో వసూలు..

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఒక ట్యూషన్ టీచర్ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. ఆరో తరగతి చదివే విద్యార్థిని ట్రాప్ చేసి లక్షల రూపాయలు కాజేశాడు. అవసరం పేరుతో డబ్బులు అడిగి తీసుకునేవాడు. విషయం విద్యార్థి తండ్రికి తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పట్టించుకోకపోవడంతో హెచ్చార్సీని ఆశ్రయించాడు. అసలు ఆ టీచర్ ఏం చేశాడనేది తెలియ్జాలన్నా.. మరిన్ని వివరాలు కావాలన్నా ఇది చదవాల్సిందే.

గురువును మన సమాజంలో ప్రత్యక్ష దైవంగా భావిస్తారు. ఎంతో గౌరవ మర్యాదలు ఇస్తారు. అయితే నేటి కాలంలో కొందరు టీచర్లు మాత్రం బుద్ధి గడ్డి తిని అడ్డమైన వేషాలు వేస్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి.. వారిని ఉన్నతంగా తీర్చి దిద్దాల్సిన టీచర్లే.. వారిని చెడు మార్గాల వైపు మళ్లిస్తున్నారు. తాజాగా ఒక ట్యూషన్ టీచర్ చేసిన పని చూసి ప్రతి ఒక్కరు షాక్ అవుతున్నారు. అతగాడి నిర్వాకం గురించి తెలిసి అవాక్కవుతున్నారు. సదరు ట్యూషన్ టీచర్ మీద పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇంతకు ఆ టీచర్ ఏం చేశాడంటే....

హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల పీఎస్ పరిధిలో ట్యూషన్ టీచర్ ఒకరు ఘరానా మోసానికి పాల్పడ్డాడు. తన వద్ద చదువుకోవడానికి వచ్చే ఒక విద్యార్థిని ట్రాప్ చేసి.. ఆ పిల్లాడి నుంచి లక్షల రూపాయలు కాజేశాడు. విషయం కాస్త విద్యార్థి తండ్రికి తెలియడంతో.. అతడు పోలీసులను ఆశ్రయించాడు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి.. సందీప్ అనే వ్యక్తి దగ్గరకు ట్యూషన్‌కు వెళ్తున్నాడు. విద్యార్థి ఉన్నత కుటుంబానికి చెందినవాడుగా గుర్తించిన సందీప్.. బాలుడికి మాయ మాటలు చెప్పి.. తన ట్రాప్‌లో పడేశాడు. అవసరం పేరుతో డబ్బులు అడిగేవాడు. సందీప్ చేసే మోసం గురించి ఏమాత్రం ఆలోచన లేని చిన్నారి.. ఇంట్లో ఎవరికీ తెలియకుండా డబ్బులు తీసుకొచ్చి టీచర్‌కు ఇస్తుండేవాడు. ఇలా సందీప్.. ఆ విద్యార్థి నుంచి రూ.లక్షల్లో కాజేశాడు.

తాజాగా మరోసారి సందీప్ డబ్బులు అడగటంతో.. ఆ మొత్తం సర్దుబాటు చేయడానికి విద్యార్థి.. తన ఐఫోన్‌ను సైతం అమ్మేందుకు రెడీ అయ్యాడు. ముందుగా విద్యార్థి సందీప్‌కు ఐఫోన్ ఇచ్చాడు. కానీ అతగాడు తనకు ఫోన్ వద్దని.. డబ్బులు కావాలని చెప్పడంతో.. విద్యార్థి మొబైల్ షాపుకు వెళ్లి ఐఫోన్ బేరం పెట్టాడు. అయితే షాపు ఓనర్‌కు అనుమానం వచ్చి.. బాలుడు తండ్రికి సమాచారం ఇచ్చాడు.

విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి షాక్ అయ్యాడు. వెంటనే ఆలస్యం చేయకుండా.. సదరు ట్యూషన్ టీచర్ మీద పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు.. జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. కానీ పోలీసులు అతడిని పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిన విద్యార్థి తండ్రి హెచ్చార్సీలో ఫిర్యాదు చేశాడు. ఊహ తెలియని బాలుడిని టీచర్ సందీప్ ట్రాప్ చేసి రూ.లక్షల్లో డబ్బు కాజేసినట్లుగా విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశాడు. అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# చిన్నారిని బలి తీసుకున్న పల్లిగింజ..

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో విషాదం చోటుచేసుకుంది. పల్లిగింజ గొంతులో ఇరుక్కుని నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. ఇంట్లో వేయించిన పల్లీలు తింటుండగా.. అనుకోకుండా గొంతులో ఇరుక్కొని ప్రాణాలు కోల్పోయింది. ఒక్కగానొక్క బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

అప్పటి వరకు తోటి స్నేహితులతో కలిసి ఆడుతూ పాడుతూ సందడి చేసిన ఓ నాలుగేళ్ల చిన్నారి విధి ఆడిన వింత నాటకంలో బలైంది. ఊహించని విధంగా ఓ పల్లి గింజ ఆ పసి ప్రాణాన్ని బలితీసుకుంది. దీంతో తమ ఒక్కగానొక్క కుమార్తెను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. తన చిట్టి పొట్టి అడుగుల చప్పుడు ఇక వినిపించదని.. ముద్దు ముద్దు మాటలు ఇకపై తమ చెవులకు చేరవని తలుచుకొని గుండెలు బాదుకున్నారు. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో చోటు చేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. లష్కర్‌గూడ గ్రామానికి చెందిన బండారి మహేశ్వరి శ్యామ్‌సుందర్ దంపతులు. వీరికి నాలుగేళ్ల వయసున్న తన్విక సంతానం. అయితే ఆదివారం అనుకోకుండా తన్విక ప్రాణాలు కోల్పోయింది. ఇంట్లో వేయించిన పల్లీలు తింటూ ఉండగా.. ఒక పల్లిగింజ పొరపాటున చిన్నారి గొంతులో ఇరుక్కుపోయింది. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న తన కుమార్తెను చూసి ఆందోళన చెందిన తల్లిదండ్రులు, క్షణం కూడా ఆలస్యం చేయకుండా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం పల్లిగింజ గొంతులో అడ్డుపడినట్లు నిర్ధారించారు. అయితే దురదృష్టవశాత్తూ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న సమయంలోనే తన్విక పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయింది. తమ ఒక్కగానొక్క కుమార్తె అనుకోని ప్రమాదం కారణంగా ప్రాణాలు కోల్పోవటంతో తల్లిదండ్రుల దుఃఖానికి అంతు లేకుండా పోయింది. చిన్నారిని మృతదేహాన్ని హత్తుకొని వారు రోధించిన తీరు.. అక్కడున్న వారిచే కంటతడి పెట్టించింది. ఈ ఘటనతో గ్రామంలోనూ విషాధ చాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పిల్లలు ఉన్న తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పిల్లలు తమ అమాయకత్వంతో ఏది పడితే అది నోట్లో పెట్టుకునే ప్రమాదం ఉంటుంది. గతంలో ఇలాంటి అనేక దురదృష్టకర సంఘటనల్లో ప్రమాదకరమైన వస్తువులు మింగడం వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. కాబట్టి, చిన్న పిల్లల చుట్టూ పడేసే చిన్న చిన్న వస్తువులు, నాణేలు, గులకరాళ్లు, ఆహార పదార్థాలైన గింజలు వంటి వాటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లలు ఆడుకునే ప్రదేశంలో ప్రమాదకరమైన వస్తువులు ఏమీ లేకుండా చూసుకోవాలి. ఏదైనా వస్తువు గొంతులో ఇరుక్కుంటే వెంటనే వైద్య సహాయం కోసం ప్రయత్నించాలి. వీలైతే ప్రథమ చికిత్స ఎలా చేయాలో కూడా తెలుసుకోవాలి.

# కొత్త రేషన్ కార్డులు వచ్చేస్తున్నాయ్.. ప్రస్తుతానికి వారికి మాత్రమే..!

**లక్షలాది దరఖాస్తులపై మాత్రం ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్త రేషన్ కార్డులు, పేర్ల చేర్పుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.**



తెలంగాణ: కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు శుభవార్త. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరు ప్రక్రియ వేగవంతమైంది. అర్హులను గుర్తించి లబ్ధిదారులకు అధికారులు కార్డులు ఇస్తున్నారు. అలాగే పాత కార్డుల్లో పేర్లు చేరుస్తున్నారు. ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక యాప్‌తో క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోంది.

కొత్త రేషన్ కార్డుల కోసం అప్లయ్ చేశారా..? అయితే మీకో తీపి కబురు. రేషన్ కార్డులు వచ్చేస్తున్నాయ్. పేద ప్రజల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఊపందుకుంది. మీసేవా కేంద్రాల్లో కొత్త కార్డుల కోసం, పాత కార్డుల్లో పేర్లు చేర్చుకునేందుకు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. విచారణ అనంతరం అర్హులైన వారికి వెంటనే కొత్త కార్డులు మంజూరు చేయడంతో పాటు, పాత కార్డుల్లో అర్హులైన వారి పేర్లను కూడా చేరుస్తున్నారు. ప్రస్తుతం మీసేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులపైనే అధికారులు దృష్టి సారించారు.

అయితే గతంలో నిర్వహించిన ప్రజా పాలన, గ్రామ/వార్డు సభల్లో స్వీకరించిన లక్షలాది దరఖాస్తులపై మాత్రం ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్త రేషన్ కార్డులు, పేర్ల చేర్పుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి మండలానికి ఒక ప్రత్యేకమైన మొబైల్ అప్లికేషన్‌ను అందించింది. ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాలు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి పరిశీలన చేస్తాయి. అక్కడికక్కడే వారు అర్హులా కాదా అని నిర్ధారించి, ఆ వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఇప్పటికే పలు మండలాల్లో ఈ క్షేత్ర స్థాయి విచారణ ప్రక్రియ కొనసాగుతోంది.

కొత్త రేషన్ కార్డులు మంజూరు అవుతుండటం, కుటుంబ సభ్యుల పేర్లు కార్డుల్లో చేరుతుండటంతో పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాబోయే రోజుల్లో ప్రజా పాలన, గ్రామ/వార్డు సభల్లో వచ్చిన దరఖాస్తులపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తుందని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయితే రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు అందుతుందని అంటున్నారు. ఇక తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అర్హులైన ప్రతి కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేస్తుంది. పేదలకు పోషకాహారం అందించటమే కాకుండా.. వారి ఆర్థిక భారం కొంతమేర తగ్గించేందుకు చర్యలు తీసుకుంది. సన్నబియ్యం పంపిణీ పథకం పేద ప్రజల జీవితాల్లో ఒక ముఖ్యమైన మార్పును తీసుకురావడానికి దోహదపడుతోంది.

**కొత్త రేషన్ కార్డులు మంజూరు అవుతుండటం, కుటుంబ సభ్యుల పేర్లు కార్డుల్లో చేరుతుండటంతో పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాబోయే రోజుల్లో ప్రజా పాలన, గ్రామ/వార్డు సభల్లో వచ్చిన దరఖాస్తులపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తుందని అధికారులు తెలిపారు.**

# తల్లితో కలిసి కోట్లు కొట్టేసిన కిలేడీ..

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్తను ఓ మహిళ రెండో పెళ్లి పేరుతో ట్రాప్ చేసి కోట్లు కాజేసింది. తన తల్లితో కలిసి బెదిరింపులకు కూడా దిగింది. దీంతో బాధితుడు కోర్టును ఆశ్రయించగా.. ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. విదేశాల్లో వ్యాపారులు, సినీ ప్రముఖులతో పరిచయాలున్నాయంటూ నమ్మించి రూ.5.8 కోట్లకు పైగా కాజేసినట్లు తేలింది. కిలేడీకి ఇదివరకే పెళ్లయి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిసింది. ఈజీ మనీకి అలవాటు పడి కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బున్నవాళ్లను ట్రాప్ చేసి పెళ్లి పేరుతో అందిన కాడికి దోచుకుంటున్నారు తాజాగా.. మాయ మాటలతో రెండో పెళ్లి చేసుకున్న ఓ మహిళ భర్తను నమ్మించి కోట్ల రూపాయలు కాజేసింది. అంతే కాకుండా తల్లితో కలిసి బెదిరింపులకు దిగింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ టోలిచౌకికి చెందిన వ్యాపారవేత్త సయ్యద్ హుస్సేన్‌కు 2021 నవంబర్‌లో జమీలా రవికుమార్ అనే మహిళ పరిచయమైంది. తాను గచ్చిబౌలిలో నివసిస్తున్నానని, విదేశాల్లో వ్యాపారాలు ఉన్నాయని నమ్మబలికింది. ఫిల్మ్‌నగర్‌లో ఉండే తన తల్లి రత్న రవికుమార్‌ను కూడా పరిచయం చేసింది. తన బాయ్‌ఫ్రెండ్‌తో విభేదాలు ఉన్నాయని చెప్పి.. కలిసి వ్యాపారం చేద్దామని సయ్యద్ ముందు ప్రతిపాదన పెట్టింది. సినీ ప్రముఖులతో పరిచయం ఉందని చెప్పి పెళ్లి చేసుకోవాలని కోరింది. ముందు సయ్యద్ నిరాకరించినా.. ఆ తర్వాత జమీలా తప్పుడు పత్రాలు సృష్టించి అతన్ని వివాహం చేసుకుంది. పెళ్లి చేసుకున్న కొద్ది కాలానికే జమీలా, ఆమె తల్లి నిజస్వరూపం బయటపడింది. సయ్యద్‌ను ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టారు. అతని వ్యాపార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ కోటి రూపాయలకు పైగా ఖర్చు చేశారు. అంతేకాకుండా.. అతని ఐఫోన్ నుంచి తెలియకుండానే మరో 80 లక్షల రూపాయలను తమ అకౌంట్‌లోకి బదిలీ చేసుకున్నారు. తల్లి కూతుళ్ల మాటలను నమ్మని సయ్యద్ వారి గురించి ఆరా తీయగా.. జమీలాకు ఇదివరకే ఇమ్రాన్ ఖాన్‌తో వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిసింది. ఆ తర్వాత కూడా జమీలా వివిధ సందర్భాల్లో మరో రూ.4 కోట్ల వరకు లాగేసింది.

దీనిపై సయ్యద్ నిలదీయడంతో.. జమీలా అతన్ని తమ నివాసానికి రాకుండా లాక్ చేసింది. బాధితుడు మొదట ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో.. తర్వాత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అన్ని ఆధారాలతో కోర్టును ఆశ్రయించాడు. తన డబ్బుతో తల్లి కూతుళ్లిద్దరూ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, వారి పాస్‌పోర్ట్, వీసాలను నిలిపివేసి తనకు న్యాయం చేయాలని కోరాడు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వారి మాయ మాటల్ని అట్టెట్ట నమ్మావ్ బ్రో అంటూ సయ్యద్‌పై సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణకు కొత్త డీజీపీ.. రేసులో ఉన్నది వీరే...

తెలంగాణ: తెలంగాణ రాష్ట్రానికి త్వరలో కొత్త పోలీస్ బాస్ రానున్నారు. ప్రస్తుత డీజీపీ జితేందర్ సెప్టెం బర్‌లో పదవీ విరమణ చేయనుండటంతో.. ఆయన స్థానంలో కొత్త డీజీపీని నియమించనున్నారు. ఈ మేరకు ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను ప్రభుత్వం యూపీఎస్సీకి పంపింది. తుది జాబితా నుంచి కొత్త డీజీపీని నియమించనున్నారు. ఈ రేసులో సీనియర్ అధికారులు రవి గుప్తా, సీవీ ఆనంద్ ముందు వరసలో ఉన్నారు. సీనియారిటీ, సర్వీస్ రికార్డుల ఆధారంగా ఎంపిక జరగనుంది.

తెలంగాణ సీఎస్ శాంతి కుమారి ఈనెలాఖరున పదవీ విరణ చేయనున్న విషయం తెలిసిందే. ఆమె స్థానంలో కొత్త సీఎస్‌గా సీనియర్ ఐఏఎస్ రామకృష్ణా రావును నియమించారు. ఇక రాష్ట్రానికి త్వరలో కొత్త పోలీస్ బాస్ కూడా రానున్నారు. ప్రస్తుత డీజీపీ డాక్టర్ జితేందర్ సెప్టెంబర్ 6న పదవీ విరమణ చేయనునుండగా.. కొత్త డీజీపీని నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

పోలీస్ శాఖలో అత్యున్నత పదవి అయిన డీజీపీ ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపింది. యూపీఎస్సీ వారి అర్హతలు, పనితీరు, సర్వీస్ రికార్డులను పరిశీలించి ముగ్గురు సీనియర్ అధికారుల పేర్లతో తుది జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. ఆ జాబితా నుంచే కొత్త డీజీపీని ఎన్నుకోనున్నారు. ప్రస్తుతానికి డీజీపీ పదవి కోసం ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం యూపీఎస్సీకి పంపిన జాబితాలో 1990 బ్యాచ్‌కు చెందిన రవి గుప్తా, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్, 1994 బ్యాచ్‌కు చెందిన ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, బి.శివధర్ రెడ్డి, డాక్టర్ సౌమ్య మిశ్రా, శిఖా గోయల్ ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే రవి గుప్తాను డీజీపీగా నియమించగా.. ఆ తర్వాత ఆయన స్థానంలో జితేందర్ బాధ్యతలు స్వీకరించారు.

ప్రస్తుతం రవి గుప్తా హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

పోటీలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారుల పదవీ విరమణ తేదీలను పరిశీలిస్తే.. కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈ ఏడాది ఆగస్టులో, రవి గుప్తా డిసెంబర్‌లో, సీవీ ఆనంద్ 2028 జూన్‌లో, ఆప్టే వినాయక్ ప్రభాకర్ 2029 అక్టోబర్‌లో, బి.శివధర్ రెడ్డి 2026 ఏప్రిల్‌లో, డాక్టర్ సౌమ్య మిశ్రా 2027 డిసెంబర్‌లో, శిఖా గోయల్ 2029 మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు.

అయితే ఈ రేసులో సీనియా రిటీ ప్రకారం..రవిగుప్తా, సీవీ ఆనంద్, శివధర్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎవరిని కొత్త డీజీపీగా నియమిస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. శివధర్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ నిఘా విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహి స్తున్నారు. సీవీ ఆనంద్ హైదరాబాద్ సీపీగా కొనసాగుతున్నారు.

# నా కొడుకును సంపేయండి సార్

జనగామ: జనగామలో లక్ష్మి అనే తల్లి తన కుమారుడి అనారోగ్యంతో విసిగిపోయి, ప్రజావాణిలో కన్నీటి పర్యంతమైంది. పుట్టుకతోనే కాళ్ళు, చేతులు చచ్చుబడిపోయిన తన 30 ఏళ్ల కుమారుడిని పోషించలేక, చంపేయమని అధికారుల ను వేడుకుంది. ప్రభుత్వం తన కుమారుడికి ఇచ్చే పింఛన్ డబ్బులు.. అతడి డైపర్లకు కూడా సరిపో వడం లేదని, ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు తమను ఆదుకోవాలని.. లేదంటే తమ కొడుకును చంపేయమని కోరుతూ కన్నీటి పర్యంతం అయ్యింది.



నవ మాసాలు కడుపులో మోసి.. పురిటి నొప్పులు భరించి.. ప్రాణాలకు తెగించి మరీ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి.. తన బిడ్డను చంపేయమని కోరిందంటే.. ఆ తల్లి ఎంతటి కష్టాన్ని అనుభవిస్తుందో అర్థం అవుతుంది. బిడ్డను చంపమన్నందుకు ఆ తల్లి ఎన్ని సార్లు చచ్చిబతికిందో ఆ పైవాడికే తెలియాలి. కడుపులో పెట్టుకుని సాకాల్సిన బిడ్డను చంపేయండి సారు అంటూ ఆ తల్లి పెట్టిన కన్నీరు ప్రతి ఒక్కరిని కదిలించాయి. నాకొడుక్కి 30 ఏళ్లు.. అయినా సంటిబిడ్డ లెక్క సాకాలే.. వాడిని సాదుడు కష్టమైతంది. ఆదుకోండి సారు.. లేదంటే నా కొడుకును సంపుండి.. అంటూ ఆ తల్లి ఏడుస్తుంటే చూసిన ప్రతి ఒక్కరు కంట తడి పెట్టుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు కురుమవాడకు చెందిన పర్శ మల్లయ్యలక్ష్మి దంపతులకు కుమారుడు సాయి, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. కొడుకు సాయి వయసు ప్రస్తుతం 30 సంవత్సరాలు. పుట్టుకతోనే కాళ్లు, చేతులు చచ్చుబడి పోయి కనీసం కూర్చోలేని పరిస్థితి అతడిది. తండ్రి ఎంసీహెచ్‌లో వాటర్‌మెన్‌గా.. తల్లి సాయిబాబా ఆలయంలో కూలి చేస్తూ పిల్లలను పోషించుకుంటున్నారు. వారి కుటుంబం గడవాలంటే.. తల్లీదండ్రులు ఇద్దరూ పనికి వెళ్లాల్సిందే. మల్లయ్య, లక్ష్మి ఇద్దరు పనికి పోతే కొడుకు సాయిని ఇంట్లో ఉంచి వెళ్లాల్సిందే. ఒక్కడే ఎలా ఉంటాడో అంటూ ఆ తల్లి మనసు బిక్కు బిక్కుమంటుంది. ఇక ప్రభుత్వం నుంచి సాయికి వచ్చే దివ్యాంగుల పింఛన్ రూ.4వేలు అతడి డైపర్లకు కూడా సరిపోవడం లేదు. మందులు, నెలవారి వైద్య ఖర్చులకు భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితి అంటున్నారు. ఇక అద్దె ఇంట్లో ఉండటంతో.. సర్కారు ఇచ్చే జీరో కరెంటు బిల్లుకు దరఖాస్తు చేసినా అది మల్లయ్య దంపతులకు వర్తించడం లేదు. తాజాగా ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా వారికి మంజూరు కాలేదు.

ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మల్లయ్య తన కొడుకును భుజాన ఎత్తుకొని వచ్చాడు. 'మేము ప్రభుత్వ పథకాలకు అర్హులం కాదా.. స్కీములు మాకు మంజూరు చేయకుంటే నా కొడుకును సంపేయండి'అంటూ కొడుకు సాయిని అక్కడే పడుకోబెట్టిన తల్లి లక్ష్మి.. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఎదుట బోరున విలపించింది. తమకున్న 50 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని.. ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పించాలని వేడుకుంది. ఆమె బాధ చూసి స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి వీరి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# మీ సేవ కేంద్రాల్లోనూ ఆధార్ కార్డు అప్‌డేషన్..

తెలంగాణ: ఆధార్ కార్డు ప్రాముఖ్యత పెరుగుతున్న కొద్దీ.. దాని అప్‌డేషన్ ప్రక్రియలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు వారాలు, నెలల వరకు కూడా వేచి ఉండాల్సి వస్తుంది. ఆధార్ అప్‌డేట్ కోసం సరైన పత్రాలు అందుబాటులో లేకపోవడం, సమర్పించిన పత్రాలు తిరస్కరించబడటం జరుగుతోంది. చిరునామా మార్పు వంటి వాటికి సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం ఇబ్బంది కలిగిస్తుంది. కొన్ని ఆధార్ సేవా కేంద్రాల్లో సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసేటప్పుడు సాంకేతిక సమస్యలు, వెబ్‌సైట్ పనిచేయకపోవడం, సరైన మార్గదర్శకాలు లేకపోవడం వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తిరస్కరణకు గల కారణాలు స్పష్టంగా తెలియకపోవడం వల్ల మళ్లీ దరఖాస్తు చేసుకోవడం కష్టమవుతుంది. ఆధార్ ప్రాధికార సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆధార్ కార్డుల్లో అడ్రస్, మొబైల్ నంబరు మార్పు సేవలు ఇక మీ-సేవ కేంద్రాల్లోనూ అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఈ సేవలు కేవలం శాశ్వత ఆధార్ కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉండటంతో, సర్వర్ సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5,243 మీ-సేవ కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది. ఈ నిర్ణయం వల్ల ప్రజలు తమ నివాస ప్రాంతాల కు సమీపంలోనే ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవడానికి అవకాశం లభిస్తుంది. గ్రామీణ ప్రజలకు ఇది మరింత సౌలభ్యంగా ఉంటుంది. ఆధార్ కేంద్రాల కోసం ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. మీ-సేవ కేంద్రాలు సాధారణంగా ఎక్కువ పని గంటలు కలిగి ఉండటం వల్ల ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో సేవలు పొందవచ్చు.

# ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరులేని వ్యక్తి.. వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా వెలుగుపల్లిలో ఇందిరమ్మ ఇంటి జాబితాలో పేరు లేదని ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కాంగ్రెస్ నాయకుడు లంచం డిమాండ్ చేశాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కనకయ్య అనే వ్యక్తిని సముదాయించి కిందకు దించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.





తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 70 వేలకు పైగా లబ్ధిదారులను ఎంపిక చేసి నిధులు విడుదల చేస్తున్నారు. అయితే అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నేతల కారణంగానే తమ పేర్లు తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో మనస్తాపానికి గురైన కనకయ్య అనే వ్యక్తి గ్రామంలోని నీటి ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

బాధితుడు కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడు. అతడి మాటలు నమ్మిన కనకయ్య అతనికి విడతల వారీగా రూ.20 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. అయితే.. తాజాగా విడుదలైన లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో కనకయ్య తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం గ్రామంలోని నీటి ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కనకయ్యను బుజ్జగించే ప్రయత్నం చేశారు. సుమారు గంటపాటు నచ్చజెప్పిన అనంతరం కనకయ్యను క్షేమంగా కిందికి దించారు. అనంతరం పోలీసులు కనకయ్య నుంచి వివరాలు సేకరించి.. ఈ ఘటనపై విచారణ చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడుపై వచ్చిన లంచం ఆరోపణలపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన వెలుగుపల్లి గ్రామంలో కలకలం రేపింది.

కాగా, ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒక నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని హామీ ఇచ్చారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, గతంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన వారికి మాత్రమే లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో లంచం తీసుకున్నారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మంత్రి స్పందిస్తూ.. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా లంచం అడిగితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.




# వైఎస్ షర్మిలపై పోలీసులకు ఫిర్యాదు..

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మోదీ అభిమాని ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షర్మిలపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలంటూ పూల ప్రేమ్ కుమార్ అనే నరేంద్ర మోదీ అభిమాని.. పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై వైఎస్ షర్మిల ఇటీవల స్పందించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రధాని మోదీని, దేశ నిఘా వ్యవస్థలను ఉద్దేశించి ఆమె అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రేమ్ కుమార్ ఫిర్యాదు చేశారు.

ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వైఎస్ షర్మిల మీద చిత్తూరు జిల్లా పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మోదీ అభిమాని పూల ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి.. వైయస్ షర్మిలపై పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్ షర్మిలపై చర్యలు తీసుకోవాలని పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారతదేశం నిఘా వ్యవస్థలపైనా, దేశ ప్రధాని మోదీని ఉద్దేశించి వైఎస్ షర్మిల అనుచిత వ్యాఖ్యలు చేశారని.. భారత రాజ్యాంగాన్ని అనుసరించి ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరోవైపు పహల్గాం ఉగ్రదాడి ఘటనపై ఇటీవల వైఎస్ షర్మిల స్పందించారు. దేశ నిఘా వ్యవస్థలను మోదీ వ్యవస్థలుగా మార్చారని.. ఇంటెలిజెన్స్ వ్యవస్థ మొత్తం మోదీ కోసం పనిచేస్తోందన్నారు. మోదీకి వ్యతిరేకంగా మాట్లాడేవారి గొంతు నొక్కేందుకు నిఘా వ్యవస్థ పనిచేస్తోందంటూ వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, హెూం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామాలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. ఏటా రెండు కోట్ల మంది కశ్మీర్ చూడ్డానికి వెళ్తుంటారని. ఇలాంటి ప్రాంతంలో సెక్యూరిటీ లోపం ఎందుకు వచ్చిందని షర్మిల ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్ కారణంగానే పహల్గాం ఉగ్రదాడి జరిగిందంటూ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు.

ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వైఎస్ షర్మిలపై పుంగనూరు పోలీసులకు ప్రధాని మోదీ అభిమాని పూల ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనలో 26 మంది పర్యాటకులు చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు పాకిస్థాన్ కారణమంటూ కేంద్రం సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేసింది. అలాగే మన దేశంలో ఉన్న పాకిస్థానీయులు వెంటనే దేశం విడిచిపెట్టి వెళ్లాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నెలాఖరులోపు దేశాన్ని విడిచి వెళ్లాలని స్పష్టం చేసింది. అటు పాకిస్థాన్ కూడా సిమ్లా ఒప్పందం వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ ఘటనతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

# తిరుపతిలో భవన నిర్మాణ పనుల్లో విషాదం..

**తిరుపతి:** తిరుపతిలో విషాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న భవనం నుండి పడి ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. ఇదిలా ఉండగా, చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. వరుస రోడ్డు ప్రమాదాలు చిత్తూరు జిల్లాలో విషాదాన్ని నింపాయి. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసలేం జరిగిందనేది ఇంకా తెలియాల్సి ఉంది.

తిరుపతి మంగళం సమీపంలో కరకంబాడి రోడ్డులోని తుడా క్వార్టర్స్ స్ప్రింగ్ డెల్ సమీపంలో హెచ్ఐజీ భవన నిర్మాణం జరుగుతోంది. అక్కడ పనుల కోసం వచ్చిన ముగ్గురు కార్మికులు ఆ భవనంపై నుంచి కిందపడి అక్కడికక్కడే చనిపోయారు. మృతులను బోటతొట్టి శ్రీనివాసులు, వసంత్, కె.శ్రీనివాసులుగా గుర్తించారు. భవన నిర్మాణ పనుల కోసం ఆ భవనం చుట్టూ కర్రల్ని ఏర్పాటు చేస్తున్నారు.. ఈ క్రమంలోనే ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భవనం యజమానిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

చిత్తూరు- తిరుపతి నేషనల్ హైవేలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కారు కంటైనర్‌ను ఢీ కొట్టింది.. ఈ ఘటనలో అందులో ఉన్న ఏడుగురిలో ఐదుగురు అక్కడికక్కడే చనిపోగా.. మిగిలిన ఇద్దర్ని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో దాదాపు 110- 120 కి.మీ. వేగంతో కారు ప్రయాణిస్తోందని చెబుతున్నారు. గాదంకి టోల్‌ప్లాజాకు మధ్యాహ్నం 1.17 గంటలకు చేరుకోగా ఆ తర్వాత ఎనిమిది- తొమ్మిది నిమిషాలకే తోటపల్లి దగ్గర ఘటన జరిగింది. అతివేగం, ముందున్న వాహనాన్ని త్వరగా క్రాస్ వెళ్లాలనే తొందరలో ప్రమాదం జరిగింది అంటున్నారు.

చిత్తూరు నగరం మురకంబట్టులో ముందు వెళ్తున్న లారీని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో చనిపోయాడు. మరో ప్రమాదంలో చిత్తూరు రూరల్ మండలం అనుప్పల్లి గ్రామానికి చెందిన ధనంజయులు పని కోసం ఇంటి నుంచి బైక్‌పై వెళుతుండగా.. అనుప్పల్లి వద్ద చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ వేపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ధనంజయులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# పోలీసుల ముందు సీఐ చేతిలో కానిస్టేబుల్‌కు అవమానం..



**ఆంధ్రప్రదేశ్:** సివిల్స్ కొట్టాలంటే పేరున్న సంస్థల్లో ట్రైనింగ్ అవసరం లేదు.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివామనే బెంగ అసలే అవసరం లేదు.. కావాల్సిందల్లా గుండెల్లో సంకల్పం, చేతల్లో చూపడమే.. కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే ఎంత పెద్ద కల అయినా నెరవేరాల్సిందే, మన ఒళ్లో

## కట్ చేస్తే ఇప్పుడు ఐపీఎస్..

వాలాల్సిందే అని నిరూపించారు.. ఉదయ్‌కృష్ణారెడ్డి.. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలానికి చెందిన ఉదయ్ కృష్ణా రెడ్డి సక్సెస్ స్టోరీ ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. సీఎం చంద్రబాబుతో ప్రశంసలు అందుకునేలా చేసింది.

ఊహ తెలియకముందే తల్లి ప్రేమకు దూరమయ్యాడు. 18 ఏళ్లు వచ్చేసరికి బాధ్యతలు చూసే తండ్రి దూరమయ్యాడు. అమ్మా నాన్నను కోల్పోయిన తనకు, తన తమ్ముడికి నాన్నమ్మే దిక్కయ్యింది. కూరగాయలు అమ్ముతూ ఇద్దరిని పోషిస్తూ, ఇల్లు చూసుకుంటూ వచ్చింది. మంచీచెడ్డలు చూసే పెద్దోళ్లు దూరం.. అప్పుడప్పుడే యవ్వనంలోకి అడుగుపెట్టిన ప్రాయం.. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతలు చూసే బంధాలు లేకపోతే పక్కదారి పట్టడానికి ఎక్కువ అవకాశం.. కానీ ఆ యువకుడు నాన్నమ్మ కష్టాన్ని గుర్తుచేసుకుంటూ గవర్నమెంట్ స్కూల్‌లోనే చదువు సాగించాడు.. అలా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇంకేం కానిస్టేబుల్ కొలువు, గవర్నమెంట్ ఉద్యోగం.. తనకూ, తన కుటుంబానికి ఓ ఆధారం దొరికింది. ఇకపై నాన్నమ్మ కష్టపడాల్సిన అవసరం లేదు.. తమ్ముడి బాగోగుల గురించి బెంగలేదు అనుకున్నాడు.. కానీ మనమొకటి తలిస్తే, దైవమొకటి తలస్తుంది కదా.. ఆ యువకుడి జీవితంలోనూ అలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఎంతో సంతోషంగా 2013లో కానిస్టేబుల్ ఉద్యోగం ప్రారంభించాడు. కానీ పక్కోడు ఎదుగుతుంటే ఓర్చుకోలేని లోకమిది. అలా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రోజుల్లో ఓ సీఐ.. అతని పాలిట విలన్‌గా మారాడు. వ్యక్తిగతంగా టార్గెట్ చేసి అవమానించడం మొదలుపెట్టాడు. చిన్నప్పటి నుంచి పడ్డ కష్టాలను గుర్తుచేసుకుని సీఐ వేధింపులను భరిస్తూ వచ్చాడు తను. కానీ ఓ రోజు అనుకోని ఘటన జరిగింది. 60 మంది పోలీసుల ముందు సీఐ చేతిలో అవమానం.. దీంతో భరించలేకపోయాడు. ఆత్మగౌరవం దెబ్బతింది.. ఆకలితో అయినా ఉండగలం కానీ, ఆత్మగౌరవం లేకుండా ఉండలేమని భావించాడు. 2018లో కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. అయితే ఆ రోజే తన జీవితాన్ని మలుపు తిప్పుతుందని.. ఆవేశంలో తీసుకున్న ఆ నిర్ణయమే తన రాతను మారుస్తుందని ఊహించలేకపోయాడు.

అవమానం తాలూకూ పెంచిన కసితో సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వడం మొదలెట్టాడు. ఒకటోసారి.. తొలి ప్రయత్నంలోనే ఇంటర్వ్యూ వరకు వెళ్లినా తప్పింది.. పర్లేదులే అనుకున్నాడు, రెండోసారి ప్రిలిమ్స్‌లోనే తప్పింది.. భయం మొదలైంది.. ఉన్న ఉద్యోగాన్ని వదిలేశా, కష్టపడి చదివితే ఫలితాలు తారుమారు అవుతున్నాయనే బెంగ మొదలైంది. మూడోసారి అంతే.. ఫ్చ్ నిరాశే ఎదురైంది.. తనలో భయం మరింత పెరిగింది. కానీ కొన్నిరోజులే.. ఈసారి బలంగా కొట్టాలని నిర్ణయించుకున్నాడు. కసిగా చదివాడు. నాలుగో ప్రయత్నంలో.. సివిల్స్‌లో సక్సెస్ అయ్యాడు. 780 ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వేస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో జాయిన్ అయ్యాడు. ఇప్పుడు ఐదోసారి ఏకంగా ఐపీఎస్?కు సెలెక్టయ్యాడు. ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి సక్సెస్ స్టోరీ ఇది. సివిల్స్ సాధించాలంటే పెద్ద పాఠశాలల్లో చదవాలని.. పేరున్న సంస్థలలో శిక్షణ పొందాలని అపోహలకు చెక్ పెడుతూ.. ఆత్మవిశ్వాసం, కఠోర శ్రమ, లక్ష్యంపై ధ్యాస ఉంటే మారుమూల సర్కారీ బడుల్లో చదివి కూడా సివిల్స్ కొట్టొచ్చని నిరూపించాడు.. సింగరాయకొండ మండలం ఓలపాలెంకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి. ఇటీవల వెల్లడైన సివిల్స్ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా లెవల్లో 350 ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. ఎంచుకున్న కెరీర్ మీద అభిరుచి, లక్ష్యంపై శ్రద్ధ ఉంటే.. ఏ కలా పెద్దది కాదని నిరూపించాడు.

# మధు కుటుంబానికి పవన్ కళ్యాణ్ రూ.50 లక్షలు సాయం

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి జనసేన పార్టీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మంగళగిరిలో సంతాప సభ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నెల్లూరుకు చెందిన మధుసూదన్‌రావు కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాలని, దేశ సమగ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడేవారిని ఆయన తీవ్రంగా ఖండించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో అమరవీరులకు జనసేన పార్టీ సంతాపాన్ని తెలియజేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పహల్గాం మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు నేతలు మౌనం పాటించారు.. ఉగ్రదాడి మృతులకు డిప్యూటీ సీఎం నివాళులు అర్పించారు. పహల్గాంలో అమాయకుల్ని ఉగ్రవాదులు అత్యంత దారుణంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన నెల్లూరు జిల్లాకు చెందిన మధుసూదన్‌రావు కుటుంబానికి జనసేన పార్టీ తరఫున రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. మధుసూదన్‌రావు కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నెల్లూరు జిల్లాకు చెందిన మధుసూదన్‌రావు ఎవరికీ హాని చేయలేదన్నారు పవన్ కళ్యాణ్. కేవలం తన కుటుంబాన్ని తీసుకుని కాశ్మీర్‌కు వెళ్లారని.. అక్కడ ఆయనను చంపేశారని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాశ్మీర్ భారత్‌ది కాబట్టే అక్కడికి వెళ్లామని మధు భార్య చెప్పిన మాటల్ని గుర్తు చేశారు. ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకే విధంగా స్పందించాలన్నారు పవన్ కళ్యాణ్. కాశ్మీర్ భారత్‌లో భాగమని.. ఓట్ల కోసం, సీట్ల కోసం ఇలాంటి విషయాలపై మాట్లాడకూడదన్నారు. దేశమంతా ఏకం కావాల్సిన సమయం వచ్చిందని.. పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడేవారు ఆ దేశానికి వెళ్లిపోవాలన్నారు. యుద్ధ పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని.. మత కలహాలు సృష్టించే వారి విషయంలోఅప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత ప్రాతిపదికన 26 మందిని చంపినా పాకిస్థాన్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదన్నారు. పహల్గాంలో పర్యాటకుల్లా వచ్చి అమాయ కులను వేటాడారని.. ఐడీ కార్డులు అడిగి హిందువులా, ముస్లింలా అని చూసి చంపడం దారుణమన్నారు పవన్ కళ్యాణ్. మతం అడిగి చంపారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నా కొందరు



నమ్మడం లేదని విమర్శించారు. అతి మంచితనం కూడా మంచిది కాదని.. కాల్చుకుంటూ పోతుంటే చూస్తూ ఊరుకోవాలా అన్నారు. గతంలో పాకిస్థాన్‌ను మూడుసార్లు ఓడించామని.. నిరాయుధులపై యుద్ధం చేయడం తప్పు.. కాశ్మీర్‌కు ఎంతో నమ్మకంతో పర్యాటకులు వెళ్లారన్నారు. ఉగ్రవాదులపై దయ చూపకూడదని, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. జనసేన పార్టీ తెలుగు రాష్ట్రాల్లోనే ఉందని.. కానీ తమది జాతీయ విధానమన్నారు. ఉగ్రవాదులను ఎదుర్కోవడం ధైర్యంతో కూడుకున్న పని అన్నారు. హిందువులకు ఈ దేశం ఒక్కటే అని, ఇక్కడ కూడా హిందువులనే టార్గెట్ చేస్తే ఎక్కడికి పోవాలన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.

# ఆ ఉద్యోగులందరికీ పండగే..

## ఎన్నాళ్లకెన్నాళ్లకు...

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామక విధానం, సమస్యలు, లోపాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఆప్కాస్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపును ప్రభుత్వం తిరస్కరించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగుల నియామక విధానం, వారి సంక్షేమానికి మరింత మెరుగైన విధానాల్ని రూపొందించే పనిలో ఉంది. ప్రభుత్వం దీని కోసం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పురపాలకశాఖ మంత్రి పి నారాయణ, విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌తో కేబినెట్ సబ్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి సర్వీసెస్ అండ్ హెచ్ఆర్ఎం (సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి) కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అంతేకాదు ఆర్థికశాఖ కార్యదర్శి ప్రత్యేక ఆహ్వానితునిగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఎంత మంది పనిచేస్తున్నారు.. వారి నియామకానికి అనుసరించిన విధానమేంటి, ప్రస్తుత వ్యవస్థలోని లోపాలు, సమస్యల్ని ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని సిఫార్సుల్ని చేయనుంది. అనంతరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకంతో పాటుగా వారి సమస్యలు, ఆ వ్యవస్థలో లోపాలను సరిదిద్దే దిశగా అడుగులు వేయనున్నారు. త్వరలోనే ఈ కమిటీ నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది. తమ సమస్యల్ని ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. తమ సమస్యలు ఎప్పటి నుంచో పెండింగ్ ఉన్నాయని.. ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తమ సమస్యల్ని కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నారు. గత నెలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పనిచేసే ఆప్కాస్ ఉద్యోగులు, సిబ్బంది, ఎన్ఆర్ఎంలకు ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడం కుదరదని తేల్చి చెప్పింది. జీవో నంబరు 15 వీరికి వర్తించదని అధికారులు తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీఎండీసీ (ఖనిజాభివృద్ధి సంస్థ)లో ఉద్యోగుల్ని తొలగించిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో పొరుగుసేవలు, కాంట్రాక్ట్ విధానంలో సిఫార్సులతో చేరిన వారిని తొలగించారు. ఈ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయనే కారణంగా, అదనంగా సిబ్బంది ఉండటంతో వీరిని తొలగించారు.

అంతేకాదు గతేడాది పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు పెండింగ్ జీతాలను చెల్లించారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలతో పెండింగ్ జీతాలు ఇచ్చే ప్రక్రియను పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది,ఈఎన్‌సీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించిన సంగతి తెలిసిందే. వీరికి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలను పునరుద్ధరించారు అధికారులు. తాజాగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఫోకస్ పెట్టారు.

# ప్రజల కోసం రూ.4 కోట్లు విరాళం

గుంటూరుకు చెందిన ఎన్నారై దంపతులు డాక్టర్ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్, కల్యాణి ప్రసాద్ సామాజిక భవనాల నిర్మాణానికి రూ.4 కోట్ల విరాళం అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వారిని సన్మానించారు. గతంలో క్యాన్సర్ ఆసుపత్రికి రూ.10 కోట్లు విరాళం ఇచ్చారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఈ భవనాలు నిర్మిస్తారు. అలాగే డీసీసీబీ ఛైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు, డీసీఎంఎస్ ఛైర్మన్‌గా వడ్రాణం హరిబాబును ప్రభుత్వం నియమించింది.

గుంటూరుకు చెందిన ఎన్నారై పెద్ద మనసు చాటుకున్నారు.. నగరంలో సామాజిక భవనాల నిర్మాణానికి ఏకంగా రూ.4 కోట్ల విరాళం ఇచ్చారు. గుంటూరు జేకేసీ కాలేజీ ఆడిటోరియంలో వీరి సన్మాన కార్యక్రమం నిర్వహించారు డాక్టర్ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్, కల్యాణి ప్రసాద్ దంపతుల్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వారిని సన్మానించారు. గతంలో వారు క్యాన్సర్ ఆసుపత్రికి రూ.10 కోట్లు విరాళం అందజేశారు.




గుంటూరు పార్లమెంట్ పరిధిలో ఈ భవనాలు నిర్మిస్తారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. రాఘవేంద్రప్రసాద్, కల్యాణి ప్రసాద్ దంపతులు మంచి మనసున్న వ్యక్తులన్నారు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.

రాఘవేంద్రప్రసాద్ అమెరికాలో నేవీలో లెఫ్టినెంట్ కమాండర్‌గా పనిచేశారన్నారు చంద్రశేఖర్. హ్యూస్టన్‌లో ప్రొఫెసర్‌గా బోధించారు.. అలాగే తానా అధ్యక్షుడిగా కూడా పనిచేశారన్నారు. తాను అమెరికాలో ఎదిగే క్రమంలో రాఘవేంద్రప్రసాద్ స్ఫూర్తినిచ్చారన్నారు. రాఘవేంద్రప్రసాద్ తనపై నమ్మకంతో భారీ విరాళం ఇచ్చారని.. దీనికి మరో రూ.50 లక్షలు జత చేస్తామని పెమ్మసాని తెలిపారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు ఉపయోగపడేలా చేస్తాం అన్నారు. చేబ్రోలు, పెదకాకాని, తుళ్లూరు, ఫిరంగిపురం, గుంటూరు రూరల్, ప్రత్తిపాడు, కొల్లిపరలో సామాజిక భవనాలు నిర్మిస్తామని కేంద్రమంత్రి వివరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరూ కలిసి రాఘవేంద్రప్రసాద్, కల్యాణి ప్రసాద్ దంపతులను అభినందించారు. వారు సమాజానికి చేస్తున్న సేవను ప్రశంసించారు.

# 'పాపకు ఏమీ కాని ఓ తల్లి'

**అనంతపురం:** అమ్మ రాజీనామా.. ఇది ఒక సినిమా పేరు.. కానీ రియల్ లైఫ్‌లోనూ ఓ తల్లి అమ్మ పదవికి రాజీనామా చేసింది. కొన్ని అనివార్య కారణాలతోనే అమ్మ పదవికి న్యాయం చేయలేకపోతున్నానని.. పొత్తిళ్లలో ఉండాల్సిన తన పసిపాపను తీసుకెళ్లి రోడ్డు పక్కన వదిలేసింది. శిశువుకు చక్కగా స్నానం చేయించి ఓ బేబీ బెడ్‌లో పడుకోబెట్టి రోడ్డు పక్కన ఉంచింది. తాను అమ్మ పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ఓ లేఖను రాసి.. అందులో తన పాపను రోడ్డుపై ఎందుకు అలా అనాథగా వదిలి వెళ్లాల్సి వచ్చిందో వివరించింది. ఆ లేఖలో చివరిగా రాసిన ఐదు పదాలు ఎమోషనల్‌గా ఉన్నాయి. విజయనగరం కాలనీ అది.. అప్పుడే పుట్టిన ఆడ శిశువును రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. పసికందు ఏడుపు విని అక్కడికి వెళ్లిన స్థానికులు చిన్నారిని అక్కున చేర్చుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు పాపను తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్చారు.. ఆ తర్వాత ఐసీడీఎస్ అధికారులు అక్కడికి వచ్చారు. చిన్నారిని తమ సంరక్షణలో ఉంచేందుకు తీసుకెళ్లారు. అయితే శిశువు దగ్గర తల్లిదండ్రులు రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఆ లేఖలో.. 'ప్రియమైన మేడం, సార్ గారికి నా నమస్కరాలు.. నా కూతుర్ని నేను పోషించలేను.. మీరే నా కూతురికి ఒక మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటూ.. మీ దగ్గర వదిలి వెళ్లిపోతున్నాను. తన జీవితం బాగుండాలి.. తనని మీరే బాగా చూసుకోవాలని వేడుకుంటున్నాను. నేను చనిపోతున్నాను. నా కూతుర్ని బాగా చూసుకోండి సార్ ప్లీజ్.. ఒక తల్లిగా నా ఆవేదన.. పాపకి ఏమీ కాని ఓ తల్లి' అంటూ ఓ నోట్‌ను ఆ చిన్నారి పాప పక్కనే వదిలేసి వెళ్లారు. పాపను రోడ్డు పక్కన వదిలేసి ఈ లేఖ ఉంచింది ఎవరు అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.. దగ్గరలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించే పనిలో ఉన్నారు. అలాగే అనంతపురం పోలీసులు పాప గురించి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న స్థానికుల్ని అడిగి తెలుసుకుంటున్నారు.

# జ్ఞానాపురం చర్చిలో బాలిక మృతి కేసులో బిగ్ ట్విస్ట్..

**విశాఖపట్నం:** విశాఖపట్నంలో ఓ చర్చిలో 11 ఏళ్ల బాలిక అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. గాలి సోకిందని బాలిక తల్లి, అమ్మమ్మ చర్చికి తీసుకెళ్లగా అక్కడ విషాదం చోటుచేసుకుంది. బాలిక నోట్లో గుడ్డ కుక్కి చున్నీతో మూతికి కట్టేయడంతో ఊపిరాడక చనిపోయిందని అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఊహించని ట్విస్ట్ ఏమిటంటే, ఆ తరువాత తల్లి, అమ్మమ్మ కూడా బావిలో శవాలై తేలారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా.. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రపంచం మొత్తం రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ పరుగులు తీస్తోంది. బ్రహ్మ సృష్టికి ప్రతి సృష్టి చేసేంతలా మనిషి తెలివి పెరిగిపోయింది. ఇంతగా అడ్వాన్స్ అవుతున్నా.. రోడ్డుపై నిమ్మకాయ కనిపించగానే ఆగిపోతాం. ఎండు

## బావిలో శవాలై తేలిన తల్లి, అమ్మమ్మ..

మిర్చి, పసుపు, కుంకుమ మనల్ని భయపెడతాయి. ఇది దేనికి సంకేతం.. 5జీ, 6జీ అంటూ పరుగులు పెడుతున్న సమాజంలో.. ఈ మూఢనమ్మకలేంటీ అంటే.. సమాధానం దొరకదు. ఎందుకంటే గ్రామీణ భారతంలోని పరిస్థితులు.. నిరక్షరాస్యత, ఇలా ఎన్నో కారణాలు ఉంటాయి. కానీ కారణాలేవైనా ప్రాణాలు తీసేంతలా మూఢనమ్మకాలు మారుతున్నాయంటే.. ఓ మనిషీ, ఆలోచించాల్సిందే..! విశాఖపట్నం జిల్లాలో జరిగిన ఓ ఘటనతో మూఢనమ్మకాలపై మళ్లీ చర్చ మొదలైంది. విశాఖపట్నం జ్ఞానపురం చర్చిలో ఇటీవల ఓ బాలిక అనుమానాస్పద మృతిలో చనిపోయింది. 11 ఏళ్లబాలిక అనుమానాస్పద స్థితిలో మరణించింది. విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన ఓ బాలికకు గాలి సోకిందంటూ ఆమె తల్లి, అమ్మమ్మ జ్ఞానాపురం చర్చికి తీసుకెళ్లారు. అయితే చర్చిలో బాలిక అనుమానస్పద స్థితిలో చనిపోయింది. బాలిక ముఖానికి చున్నీ చుట్టినట్లు, అలాగే ఆమె నోట్లో గుడ్డ కుక్కినట్లు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించారు. తనకు తెలియకుండానే బాలికను చర్చికి తీసుకెళ్లారని, ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ విశాఖ ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ మొదలెట్టారు. ఈ క్రమంలోనే బాలిక తల్లి, అమ్మమ్మను సైతం విచారించారు.

అయితే జ్ఞానాపురం చర్చి బాలిక మృతి కేసు అనూహ్యమైన ట్విస్ట్ తిరిగింది. చనిపోయిన బాలిక తల్లి, అమ్మమ్మ.. బావిలో శవమై తేలారు. పోలీస్ కేసుకు భయపడి వీరిద్దరూ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు మండలం గూడెం గ్రామంలోని ఓ బావిలో వీరి మృతదేహాలు కనిపించాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మరోవైపు బాలిక చనిపోవడానికి కూడా తల్లి, అమ్మమ్మ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాలికకు గాలి సోకిందని, కరుస్తోందని నోట్లో గుడ్డ కుక్కి, మూతికి వస్త్రాని చుట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఆ బాలిక ఊపిరాడక చనిపోయిందా లేదా మానసిక సమస్యలతో చనిపోయిందా అనే దానిపైనా దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మరోవైపు బాలిక తల్లిదండ్రులు వేర్వేరుగా ఉంటున్నారని పోలీసులు వివరించారు.

## విక్రయాల్లో హ్యుందాయ్ ఐ10 కొత్త మైలురాయి



దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ అనుబంధ హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ సరికొత్త మైలురాయిని అందుకుంది. భారత్ సహా ఎగుమతి చేసిన మార్కెట్లు కలిపి మొత్తం 33 లక్షల విక్రయాలను నమోదు చేసింది. ఒక్క భారత్‌లోనే 20 లక్షల యూనిట్లను విక్రయించగా.. దక్షిణాఫ్రికా, మెక్సికో, చిలీ, పెరూ వంటి 140కి పైగా దేశాలకు 13 లక్షల వాహనాలను ఇక్కడి నుంచి ఎగుమతి చేసింది. తద్వారా ప్రపంచ దేశాలకు భారత్ నుంచి వాహనాలను ఎగుమతి చేసే వాహనదారుగా హ్యుందాయ్ మోటార్ ఇండియా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది.

బ్రాండ్ ఐ10 33 లక్షల వాహన విక్రయాల మైలురాయిని అందుకోవడం పట్ల హ్యుందాయ్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఉన్సూ కిమ్ సంతోషం వ్యక్తంచేశారు. ప్రపంచస్థాయి ప్రొడక్టులను హ్యుందాయ్ ఉత్పత్తి చేస్తోందనడానికి ఇదే నిదర్శనమన్నారు. వినియోగదారుల సంతృప్తి, ప్రపంచంలోనే అత్యుత్తమ ఆటోమొబైల్‌గా నిలవాలన్న తమ దృఢ సంకల్పం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు.

## ఫుడ్ డెలివరీ విభాగంలోకి ర్యాపిడో!




నచ్చిన ఆహార పదార్థాలను నిమిషాల్లోనే ఇంటికి తెచ్చి ఇస్తుండటంతో ఫుడ్ డెలివరీ విభాగానికి ఆదరణ పెరుగుతోంది. దీంతో ఈ విభాగంలో అడుగు పెట్టాలని ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో చూస్తోంది. రానున్న వారాల్లోనే ఈతరహా సేవల్ని బెంగళూరులో ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

ఫుడ్ డెలివరీ విభాగంలో ప్రస్తుతం స్విగ్గీ, జొమాటో.. రెండు సంస్థలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. దీంతో ఈ విభాగంలో గట్టి పోటీ ఇచ్చేందుకు ర్యాపిడో ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం కేఎఫ్‌సీ, పిజ్జా హట్‌తో పాటు క్విక్ సర్వీస్ రెస్టరంట్లు, క్లౌడ్ కిచెన్‌లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. పైలట్ ప్రోగ్రామ్‌లో భాగంగా బెంగళూరులోని కొన్ని ప్రాంతాల్లోనే తొలుత ఈ సేవల్ని అందించనుంది.

## సీఎంఎఫ్ ఫోన్2 ప్రో వచ్చేసింది!



నథింగ్ సబ్‌బ్రాండ్ సీఎంఎఫ్ సరికొత్త స్మార్ట్ ఫోన్‌ను సోమవారం భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. సీఎంఎఫ్ ఫోన్2 ప్రో పేరుతో తీసుకొచ్చిన ఈ మొబైల్‌లో అమోలెడ్ డిస్‌ప్లే, 5000%పాూష్ట్ర% బ్యాటరీ, ట్రిపుల్ కెమెరా సెటప్, రివర్స్ ఛార్జింగ్ తదితర ఫీచర్లతో దీన్ని విడుదల చేశారు.

సీఎంఎఫ్2 ప్రో ఫీచర్ల విషయానికొస్తే.. 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీం అమోలెడ్ డిస్‌ప్లే, 120%ఎఓ% రిఫ్రెష్ రేటుతో వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 చిప్‌సెట్‌ను ఇందులో అమర్చారు. గతేడాది విడుదలైన సీఎంఎఫ్1తో పోలిస్తే 10 శాతం అదనపు సామర్థ్యంతో పని చేయనుంది. ఆండ్రాయిడ్ 15 ఓఎస్‌తో ఆధారిత నథింగ్ ఓఎస్ 3.2తో వస్తోంది. మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది.

ఇక కెమెరా విషయానికొస్తే.. వెనుకవైపు 50 మెగాపిక్సెల్ మెయిన్ కెమెరా, 50 మెగాపిక్సెల్ టెలి ఫొటోలెన్స్, 8 మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ యాంగిల్ ఇచ్చారు. టెలిఫొటోలెన్స్ 2ఎక్స్ వరకూ ఆప్టికల్ జూమ్, 20ఎక్స్ వరకూ డిజిటల్ జూమ్‌ను ఇది సపోర్ట్ చేస్తుంది. సెల్ఫీల కోసం ముందువైపు 16 మెగాపిక్సెల్ కెమెరాను అమర్చారు. నథింగ్ ట్రూలెన్స్ ఇంజిన్ 3.0 టెక్నాలజీతో అనుసంధానమైన కెమెరాలు మెరుగైన ఫొటోలను అందిస్తుందని కంపెనీ చెబుతోంది.

# వెయ్యి పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..



### రిలయన్స్ 5% జంప్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఓ వైపు భారత్- పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కొనసాగుతుండడం, మెరుగైన త్రైమాసిక ఫలితాల కారణంగా మన సూచీలు రాణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,300 ఎగువన ముగిసింది. అయితే, భౌగోళిక ఉద్రిక్తతలను మదుపర్లు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

సెన్సెక్స్ ఉదయం 79,343.63 (క్రితం ముగింపు 79,212.53) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 80,321.88 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1005.84 పాయింట్ల లాభంతో 80,218.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 289.15 పాయింట్ల లాభంతో 24,328.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు బలపడి 85.04గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,288 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..**

క్యూ4 ఫలితాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అంచనాలను మించి రాణించింది. దీంతో నేడు కంపెనీ షేరు దాదాపు 5 శాతం మేర పెరిగి రూ.1366కు చేరింది. దీనికితోడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి.

గత కొన్ని రోజులుగా విదేశీ సంస్థాగత మదుపర్లు భారత ఈక్విటీల్లో కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. గత 8 ట్రేడింగ్ సెషన్లలో దాదాపు రూ.32 వేల కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్ఐఐలు కొనుగోలు చేశారు.

టారిఫ్‌ల విషయంలో అమెరికా-చైనాల మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న సంకేతాలు కూడా అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ రాణించడానికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు.

పహల్గాం ఉగ్రదాడి ఘటనతో భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్తతల భయాలు ఓవైపు కొనసాగుతున్నా.. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి పాజిటివ్ సంకేతాలు, డాలర్ బలహీన పడడం, క్రూడాయిల్ ధరలు 66-67 డాలర్ల మధ్య ట్రేడవుతుండడం వంటివి మన మార్కెట్లకు సానుకూలంగా మారాయి.

# చిన్నారులతో మెటా ఏఐ చాట్‌బాట్స్ అసభ్యకర సంభాషణలు!



జుకర్‌బర్గ్ నేతృత్వంలోని టెక్ సంస్థ మెటా రూపొందించిన ఏఐ అసిస్టెంట్ 'మెటా ఏఐ' చాట్‌బాట్స్ వినియోగంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ చాట్‌బాట్స్ సెలబ్రిటీల వాయిస్‌లను అనుకరించడంతో పాటు, చిన్నారులతో అసభ్యకర సంభాషణలు సాగిస్తున్నట్లు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' తన పరిశోధనలో గుర్తించింది. వీటిపై నియంత్రణ లేకపోవడంతో మైనర్లు కూడా వాటిని వినియోగించుకొని పెడదోవ పడుతున్నారంటూ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మెటాకు చెందిన ఏఐ చాట్‌బాట్స్ సేవలు వాట్సప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ మెసెంజర్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ చాట్‌బాట్లు ప్రముఖుల స్వరాలను ఉపయోగిస్తూ యూజర్లతో అసభ్యకర సంభాషణల్లో పాల్గొంటున్నాయని తమ దర్యాప్తులో తేలిందని వాల్ స్ట్రీట్ కథనం పేర్కొంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లలో టెక్స్ట్, సెల్ఫీలు, లైవ్ కన్వర్జేషన్ ఫీచర్లను ఆ సంస్థ దుర్వినియోగం చేస్తోందని తెలిపింది. జాన్ సీనా, క్రిస్టెన్ బెల్, జూడి డెంచ్ వంటి ప్రముఖుల స్వరాలను తన ఏఐ అసిస్టెంట్‌ల కోసం ఉపయోగించుకొనేందుకు కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇలా జాన్ సీనా వాయిస్‌తో 14 ఏళ్ల అమ్మాయి సంభాషించే సమయంలో మెటా చాట్‌బాట్ అసభ్యకర పదాలు వినియోగించినట్లు తెలుస్తోంది.

తమపై వస్తున్న ఆరోపణలపై మెటా స్పందించింది. ఈ కథనం తప్పుదోవ పట్టించేలా ఉందని పేర్కొంది. అయినప్పటికీ తమ చాట్‌బాట్ వినియోగంపై మార్పులు చేస్తున్నట్లు మెటా తెలిపింది. ఇకపై మైనర్లపై నమోదైన ఖాతాలు ఏఐతో అసభ్యకర సంభాషణలు చేసే అవకాశం ఉండబోదని తెలిపింది. దీంతోపాటు ప్రముఖుల గొంతు ఉపయోగించి అసభ్యకర ఆడియో సంభాషణల్ని తగ్గించినట్లు తెలిపింది. దీనిపై అదనపు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొంది. మరోవైపు ఫేస్‌బుక్, ఇన్‌స్టా వినియోగం వల్ల యువకులు, చిన్న పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతోందన్న ఆరోపణలూ ఉన్నాయి. దిద్దుబాటు చర్యల్లో భాగంగా పిల్లల కోసం ప్రత్యేక ఖాతాలు, కంటెంట్‌పై నియంత్రణ వంటి చర్యలను మెటా చేపట్టింది.

## వన్‌ప్లస్ నుంచి త్వరలో కాంపాక్ట్ ఫోన్



చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ నుంచి చేతిలో ఇమిడిపోయే కాంపాక్ట్ ఫోన్ రాబోతోంది. వన్‌ప్లస్ 13S పేరిట ఈ ఫోన్ త్వరలో తీసుకురానున్నారు. ఈ మేరకు కంపెనీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. వెబ్‌సైట్‌లోనూ 'కమింగ్ సూన్' అని పేర్కొంది. కంపెనీ విడుదల చేసిన ఇమేజ్‌ను చూస్తే గత వారం చైనాలో విడుదల చేసిన వన్‌ప్లస్ 13Tనే ఇక్కడ వన్‌ప్లస్ 13Sగా తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

వనప్లస్ 13Tకి సంబంధించి తొలి చిత్రం బయటకు రాగానే చాలా మంది ఆ లుక్‌ను చూసి ఫిదా అయ్యారు. కాంపాక్ట్ సైజులో, వన్‌ప్లస్ గత మోడళ్లకు భిన్నంగా ఈ ఫోన్ ఉండడంతో చాలా మందిని ఆకట్టుకుంది. అక్కడ బేస్ మోడల్‌ను 12జీబీం 256జీబీ వేరియంట్‌లో తీసుకొచ్చారు. ధరను 3,399 యువాన్లుగా నిర్ణయించారు. అంటే మన దేశీయ కరెన్సీ ప్రకారం రూ.39 వేలు అన్నమాట. రెండు కలర్ ఆప్షన్లలో తీసుకొచ్చారు.

# భారత్..విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 50GW



భారత్ ప్రతి సంవత్సరం 50 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ శక్తిని అదనంగా ఉత్పత్తి చేస్తే, 2029 నాటికి థర్మల్ బొగ్గు దిగుమతిని పూర్తిగా ఆపివేయొచ్చని 'థింక్ ట్యాంక్ క్లైమేట్ రిస్క్ హారిజన్' రూపొందించిన నివేదిక తెలిపింది. ఇలా పునరుత్పాదక విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయడం వల్ల 2025-29 మధ్య దాదాపు 66 బిలియన్ డాలర్ల(రూ.5.55 లక్షల కోట్లు) విదేశీ మారకద్రవ్యాన్ని భారత్ ఆదా చేయొచ్చని ఈ నివేదిక ఈరోజు (సోమవారం) తెలిపింది. 2023-24లో 21 బిలియన్ డాలర్ల వ్యయంతో దాదాపు 20.60 కోట్ల టన్నుల థర్మల్ బొగ్గును భారత్ దిగుమతి చేసుకుంది. దేశంలోని విద్యుత్ రంగం బొగ్గు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడి ఉందని ఈ నివేదిక పేర్కొంది. థర్మల్ బొగ్గు దిగుమతి ఏటా 3.7 శాతం చొప్పున క్రమంగా పెరుగుతోంది, 2013 నుంచి 40 శాతానికి పెరిగింది. పట్టణీకరణ, పారిశ్రామిక వృద్ధి, విద్యుత్ సాంకేతిక పరిజ్ఞానాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల భారతదేశ ఇంధన డిమాండ్ పెరుగుతూనే ఉందని నివేదిక హెచ్చరించింది.

2023-24లో, భారత్ తన పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను నవీకరించింది. ఇప్పుడు 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన శక్తి సామర్థ్యాన్ని కలిగి ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని సాధించడానికి, 2027-28 వరకు ప్రతి సంవత్సరం 50 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ శక్తిని జోడించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం భారత్..సౌర, పవన రంగాల నుంచి దాదాపు 151 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ శక్తిని కలిగి ఉంది. హైడ్రో, స్మాల్-హైడ్రో, బయోగ్యాస్‌ను చేర్చినట్లయితే దాదాపు 200 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేస్తోంది. 2030 నాటికి లక్ష్యాన్ని చేరుకోవడానికి, దేశం ప్రతి సంవత్సరం 50 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ శక్తిని జోడించాలి. 2024-25లో భారత్ 24 గిగావాట్లను జోడించింది, ఇది ఇప్పటివరకు ఒకే సంవత్సరంలో జోడించిన అత్యధిక మొత్తం.



## కూతురి స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టని బిల్‌గేట్స్..

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ తన కూతురు ఫీబీ గేట్స్ పై ప్రశంసల జల్లు కురిపించారు. తనపై ఆధారపడకుండా స్వతంత్రంగా స్టార్టప్ కోసం నిధులు సమకూర్చుకోవడంపై సంతోషం వ్యక్తంచేశారు. తాజాగా న్యూయార్క్ టైమ్స్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఈ విషయాన్ని పంచుకున్నారు.

ఫీబీ గేట్స్ ఇటీవల 'ఫియా' స్టార్టప్‌ను ప్రారంభించారు. దీనికోసం నిధులు సమకూర్చుకొనే ప్రయత్నంలో తన వద్దకు వస్తుందని బిల్‌గేట్స్ ఊహించారట. అయితే ఆమె మాత్రం తండ్రిపై ఆధారపడకుండా సొంతంగానే నిధులు సమకూర్చుకుంది. ఈ విషయం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని గేట్స్ తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఒకవేళ ఆర్థికంగా సాయం కోరి వస్తే తాను సంతోషంగా అంగీకరించేవాడినని బిల్‌గేట్స్ పేర్కొన్నారు. అయితే తాను నిధులు ఇచ్చినట్లయితే కచ్చితంగా కొన్ని షరతులు పెట్టేవాడినన్నారు. అలా అడగకుండా సొంతంగానే నిధులు సమకూర్చుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఫీబీ గేట్స్, తన స్నేహితురాలు సోషియా కియానితో కలిసి తాజాగా 'ఫియా' స్టార్టప్‌ను స్థాపించారు. ఇది డిజిటల్ ఫ్యాషన్ ప్లాట్‌ఫామ్. 40వేలకు పైగా వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉండే దుస్తుల ధరలను ముందుంచుతుంది. ఫ్యాషన్ ఉత్పత్తులపై వినియోగదారులకు బెస్ట్ డీల్స్‌ను అందించడంతో పాటు ఆన్‌లైన్ షాపింగ్‌ను మరింత స్మార్ట్‌గా మార్చడమే

ఈ ప్లాట్‌ఫామ్ లక్ష్యం. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఫీబీ గేట్స్.. తన స్టార్టప్ కోసం వెంచర్ క్యాపిటలిస్టులు, ఏంజెల్ ఇన్వెస్టర్ల నుంచి 500,000 డాలర్లకు పైగా నిధుల్ని సమకూర్చుకున్నారు.

బిల్‌గేట్స్, ఆయన మాజీ భార్య మెలిందాకు ముగ్గురు సంతానం. వారి పేర్లు.. జెన్నిఫర్, రోరీ గేట్స్, ఫీబీ గేట్స్. ఫోర్బ్స్ 2025 ప్రపంచ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. బిల్‌గేట్స్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ధనవంతుల్లో 13వ స్థానంలో ఉన్నారు. ఆయన నికర సంపద విలువ సుమారు 102.2 బిలియన్ డాలర్లు.

# 2028 నుంచి ఐపీఎల్‌లో 94 మ్యాచ్‌లు?



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ను మరో 20 మ్యాచ్‌లకు విస్తరించాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు యోచిస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు. అయితే, ఇప్పట్లో కొత్త ఫ్రాంఛైజీలను ప్రవేశపెట్టే ఆలోచన లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎల్ మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. తదుపరి (2028) ఐపీఎల్ మీడియా హక్కుల సైకిల్ ప్రారంభంకానుంది. అప్పటి నుంచి 94 మ్యాచ్‌లు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నాయని ఐపీఎల్ ఛైర్మన్ తెలిపారు. 'దీని గురించి ఐసీసీలో చర్చిస్తున్నాం. బీసీసీఐలోనూ అంతర్గత చర్చ జరుగుతోంది. ఫ్రాంఛైజీ క్రికెట్, టీ20 క్రికెట్, ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్‌లకు సంబంధించి అభిమానుల ఆసక్తి ఎలా మారుతోంది అనే విషయాలపై మేం మరింత లోతుగా చర్చించాల్సిన అవసరముంది. టోర్నీని విస్తరించాలంటే మ్యాచ్‌లను 74 నుంచి 84 లేదా 94కి పెంచాలి. ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో రెండేసి మ్యాచ్‌లు (సొంత మైదానంలో ఒకటి, ప్రత్యర్థి మైదానంలో ఒకటి) 94 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది' అని అరుణ్ ధుమాల్ వివరించారు.

**ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ఇది**

ప్రస్తుతం ప్రతి సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా జట్లు గెలిచిన టైటిళ్ల సంఖ్య, ఫైనల్, ప్లే ఆఫ్స్ చేరిన సంఖ్య ఆధారంగా 10 జట్లకు సీడింగ్ ఇచ్చి రెండు గ్రూప్‌లుగా విభజించారు. ఒకే గ్రూప్‌లో ఉన్న జట్ల మధ్య రెండేసి మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ప్రత్యర్థి గ్రూప్‌లో తమతో సమానంగా ఉన్న జట్టుతో రెండుసార్లు... మిగతా జట్లతో ఒకసారి తలపడుతున్నాయి. ఉదాహరణకు ఈ సారి ముంబయి ఇండియన్స్, ఆర్సీబీ వేర్వేరు గ్రూప్‌ల్లో ఉండటంతో ఒకే సారి తలపడ్డాయి. ముంబయి, సీఎస్కే వేర్వేరు గ్రూప్‌ల్లో ఉన్నా.. సేమ్ సీడింగ్ (ర్యాంకు) ఉండటంతో రెండు మ్యాచ్‌ల్లో తలపడ్డాయి.

# శతక్కొట్టిన 14 ఏళ్ల వైభవ్

## గుజరాత్‌పై రాజస్థాన్ ఘనవిజయం



జైపూర్ : రాజస్థాన్ రాయల్స్‌కు అదిరే విజయం. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (101) మెరుపు శతకం బాదడంతో ఆ జట్టు సోమవారం 8 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించింది. శుభ్‌మన్ గిల్ (84), బట్లర్ (50) చెలరేగడంతో మొదట గుజరాత్ 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. వైభవ్‌తో పాటు యశస్వి జైస్వాల్ (70 నాటౌట్‌బీ 40 బంతుల్లో 9ఐ4, 2ఐ6) విరుచుకుపడడంతో లక్ష్యాన్ని రాజస్థాన్ 15.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఈ ఐపీఎల్‌లో 10 మ్యాచ్‌లాడిన రాజస్థాన్‌కు ఇది మూడో విజయం. 9 మ్యాచ్‌ల్లో గుజరాత్‌కిది మూడో ఓటమి.

**ఆకాశమే హద్దుగా..:** అది చిన్న లక్ష్యమేమీ కాదు. కానీ వైభవ్ సూర్యవంశీ వీర విధ్వంసంతో సునాయాసంగా ఛేదించేసింది రాజస్థాన్. అయితే సిక్స్.. లేదంటే ఫోర్! ఇలా సాగింది వైభవ్ విధ్వంసం. నిర్భీతిగా, స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడీ చిన్నోడు. చక్కని టైమింగ్, పవర్‌తో సిరాజ్, ఇషాంత్, సుందర్ వంటి బౌలర్లను అతడు దంచేస్తుంటే స్టేడియం ఉర్రూతలూగిపోయింది. సిరాజ్ బౌలింగ్‌లో స్ట్రెయిట్ సిక్స్‌తో మొదలెట్టిన వైభవ్ ఏ దశలోనూ తగ్గలేదు. కనికరం లేకుండా కొట్టుకుంటూ పోయాడు. అతడు మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లు బాదడంతో ఓ ఓవర్లో ఇషాంత్ ఏకంగా 28 పరుగులు సమర్పించుకున్నాడు. సుందర్ బౌలింగ్‌లో మరో రెండు సిక్స్‌లు, ఫోర్ దంచేసిన వైభవ్.. 21 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. పదో ఓవర్లో అతడి విధ్వంసం పరాకాష్ఠకు చేరింది. ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడిన



కరీమ్ జనత్‌కు పీడకలను మిగులుస్తూ అతడి ఓవర్లో వరుసగా 6, 4, 6, 4, 4, 6 బాదేశాడు. మేటి లెగ్‌స్పిన్నర్ రషీద్ ఖాన్ బౌలింగ్‌లో సిక్స్‌తో వైభవ్ శతకాన్నందుకున్నాడు. జట్టు స్కోరు 166 వద్ద వైభవ్, ఆ వెంటనే నితీశ్ రాణా (4) ఔటైనా.. పరాగ్ (32 నాటౌట్)తో కలిసి జైస్వాల్ తేలికగా పని పూర్తి చేశాడు. జైస్వాల్ కూడా ఎడాపెడా బౌండరీలతో చెలరేగినా.. అతడి ఇన్నింగ్స్ మరుగున పడిందంటే వైభవ్ ఏ స్థాయిలో విరుచుకుపడ్డాడో అర్థం చేసుకోవచ్చు.

**గిల్ అదరహో..:** గుజరాత్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆటే హైలైట్. సూపర్ ఫామ్‌లో ఉన్న అతడు మరోసారి అదరగొట్టాడు. సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన అతడు.. సాయిసుదర్శన్ (39), బట్లర్‌లతో విలువైన భాగస్వామ్యాలతో తన జట్టుకు భారీ స్కోరును అందించాడు. టైటాన్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. సుదర్శన్‌తో కలిసి గిల్ మరోసారి శుభారంభాన్నిచ్చాడు. గిల్ కాస్త ధాటిగా ఆడగా.. సుదర్శన్ ఎక్కువగా సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. గిల్ నెమ్మదిగానే మొదలెట్టినప్పటికీ యుధ్‌వీర్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లతో లయనందుకున్నాడు. ముచ్చటైన ఆఫ్‌డ్రైవ్‌లతో అలరించాడు. పరాగ్ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్‌తో సిక్స్ బాదేశాడు. 29 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు యుధ్‌వీర్ బౌలింగ్‌లో ఓ సిక్స్‌తో సుదర్శన్ జోరందుకునేలా కనిపించినా.. ఆ తర్వాత ఎక్కువసేపు నిలువలేదు. 11వ ఓవర్లో తీక్షణ బౌలింగ్‌లో అతడు భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించి లాంగాన్‌లో చిక్కడంతో 93 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కానీ ఆ తర్వాత గిల్ దూకుడు పెంచాడు. సందీప్ ఓవర్లో సిక్స్, యుధ్‌వీర్ బౌలింగ్‌లో రెండు కళ్లు చెదిరే సిక్స్‌లు కొట్టాడు. మరోవైపు బట్లర్ కూడా ఉతికేశాడు. హసరంగ ఓవర్లో వరుసగా 6, 6, 4, 6తో చెలరేగిపోయాడు. అయితే శతకం దిశగా సాగుతున్న గిల్‌ను 17వ ఓవర్లో తీక్షణ వెనక్కి పంపడంతో 74 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బట్లర్ ధనాధన్ బ్యాటింగ్‌ను కొనసాగించడంతో ఆఖరి మూడు ఓవర్లలో టైటాన్స్ 41 పరుగులు రాబట్టింది.



# ఔరా.. సూర్యా!

### 35 బంతుల్లోనే సెంచరీ

### ఐపీఎల్‌లో 14 ఏళ్ల కుర్రాడి వీరవిహారం

ఐదు నెలల ముందు 14 ఏళ్ల కుర్రాడు ఐపీఎల్ వేలంలో కోటి రూపాయలకు పైగా రేటు పలికాడని తెలిసి ఆశ్చర్యపోయాం. పది రోజుల ముందు ఆ కుర్రాడు తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతూ ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్ బాదడం, క్రీజులో ఉన్నంతసేపు ధనాధన్ షాట్లు ఆడడం చూసి అబ్బురపడ్డాం. ఇప్పుడా చిన్నోడు ఏకంగా సెంచరీ కొట్టేశాడు.. అది కూడా కేవలం 35 బంతుల్లోనే. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియాన్ని తుపాను లాంటి ఇన్నింగ్స్‌తో చుట్టేసిన ఆ చిచ్చర పిడుగే.. వైభవ్ సూర్యవంశీ. సోమవారం నాటికి 14 ఏళ్ల 32 రోజుల వయసున్న ఈ కుర్రాడు.. ఐపీఎల్‌లోనే కాక మొత్తంగా టీ20 క్రికెట్లో శతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలోనే రెండో వేగవంతమైన శతకం అతడిదే. ఈ రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ ధాటికి.. గుజరాత్ నిర్దేశించిన 210 పరుగుల భారీ లక్ష్యం చిన్నబోయింది.

# స్పిన్ బౌలింగ్ కోచ్ రేసులో జోషి

దిల్లీ: భారత మాజీ ఆఫ్ స్పిన్నర్ సునీల్ జోషి .. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) స్పిన్ బౌలింగ్ కోచ్ రేసులో నిలిచాడు. 54 ఏళ్ల జోషి.. 1996-2002 మధ్య భారత్ తరఫున 15 టెస్టులు, 69 వన్డేలు



ఆడాడు. ప్రస్తుతం అతడు ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు స్పిన్ కోచ్‌గా ఉన్నాడు. జోషి బంగ్లాదేశ్ జట్టుకు సలహాదారుగా కూడా పని చేశాడు. సీవోఈ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ సారథ్యంలోని ప్యానల్ ముందు ఆన్‌లైన్‌లో జోషి ఇంటర్వ్యూకు హాజరయ్యాడని సమాచారం. గత ఏడాది సాయిరాజ్ బహుతులే రాజీనామా చేసిన తర్వాత కోచ్‌గా మరొకరిని ఎంపిక చేయలేదు. జోషితో పాటు రాకేశ్ ధ్రువ్ (గుజరాత్ మాజీ స్పిన్నర్), ప్రీతమ్ గంధే (విదర్భ) నూషిన్ అల్ ఖదీర్ (కర్ణాటక) కూడా కోచ్ కోసం పోటీలో ఉన్నారు. "సీవోఈ స్పిన్ కోచ్ రేసులో సునీల్ జోషి మిగిలినవాళ్ల కంటే ముందున్నాడు. దరఖాస్తు చేసినవాళ్లలో అతడికి మాత్రమే టెస్టు క్రికెట్ ఆడిన అనుభవం ఉంది. కోచ్‌గానూ పని చేశాడు" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. గతంలో బెంగళూరు వేదికగా నడిచిన జాతీయ క్రికెట్ అకాడమీనే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మారింది. ఈ సంస్థకు బెంగళూరే వేదిక. కానీ కార్యకలాపాలు చిన్నస్వామి స్టేడియం నుంచి వేరే చోటుకు మార్చారు.

# యువ బ్యాటర్‌పై ప్రశంసల వర్షం

కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించిన 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. గుజరాత్ టైటాన్స్‌పై రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించడంలో వైభవ్ కీలక పాత్ర పోషించాడు. జీటీ నిర్దేశించిన 210 పరుగుల టార్గెట్‌ను రాజస్థాన్ 16 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది.

"వైభవ్.. నీ ఫియర్‌లెస్ ఆటతీరు సూపర్. బ్యాట్‌ను కదిపే వేగం, బంతిని అంచనా వేసే విధానం, బౌండరీకి పంపే ఎనర్జీ బాగుంది. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడావు"

**- సచిన్ తెందూల్కర్**

"మనం 14 ఏళ్ల వయసులో ఏం చేస్తున్నాం? కానీ, ఈ కుర్రాడు మాత్రం ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. కన్ను ఆర్పకుండా అతడి ఆటను చూసేలా చేశాడు. వైభవ్ సూర్యవంశీ ఈ పేరు గుర్తుండి పోతుంది. భవిష్యత్తు తరం వెలిగిపోతుందని గర్వంగా చెప్పగలను" **- యువరాజ్ సింగ్**

"పద్నాలుగేళ్ల వయసులో చాలామంది తమకిష్టమైన ఐస్‌క్రీమ్ తినేందుకు ఆసక్తి చూపిస్తారు. వైభవ్ మాత్రం ఐపీఎల్‌లో సూపర్ సెంచరీ సాధించాడు. భారత క్రికెట్ తర్వాత జనరేషన్ సూపర్ స్టార్ వచ్చేశాడు"

**- కృష్ణమాచారి శ్రీకాంత్**

"వైభవ్ ఆటను చూడటం చరిత్రలో నిలిచిపోయే అద్భుతం. 200ం టార్గెట్ ఉన్నా సరే ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఆటడం బాగుంది. అదీనూ 14 ఏళ్ల వయసులో ఇలాంటి ఆటతీరు ప్రదర్శించడం అభినందనీయం. చాలా బాగా ఆడావు ఛాంపియన్"

**- మిథాలీ రాజ్**

# భారత్‌కు చావోరేవో



షియామెన్ (చైనా): బీడబ్ల్యూఎఫ్ సుదిర్మన్ కప్ ఫైనల్స్‌లో చావోరేవో పోరుకు భారత్ సిద్ధమైంది. నాకౌట్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితుల్లో మంగళవారం ఇండోనేసియాతో భారత్ తలపడనుంది. ఆదివారం గ్రూపు-డి తొలి పోరులో భారత్ 1-4తో డెన్మార్క్ చేతిలో పరాజయం పాలైంది. ఇండోనేసియా చేతిలో ఇంగ్లాండ్ ఓడింది. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ నేపథ్యంలో నాకౌట్ రేసులో నివాలంటే ఇండోనేసియాతో మ్యాచ్‌లో భారత్‌కు విజయం తప్పనిసరి. స్టార్ క్రీడాకారులు పి.వి.సింధు, హెచ్.ఎస్.ప్రణయ్, లక్ష్యసేన్ ఫామ్‌లో లేకపోవడం భారత్‌కు ప్రతికూలాంశమే. అగ్రశ్రేణి డబుల్స్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి, గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ టోర్నీకి దూరంగా ఉండటం కూడా భారత్ ప్రదర్శనపై ప్రభావం చూపుతోంది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్- రుబన్ కుమార్, మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో- శ్రుతి మిశ్రా, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీలు ఏమేరకు రాణిస్తాయో చూడాలి.

ఉత్తేజిత దినపత్రిక






# కశ్మీర్ ఇండియాదే.. వాళ్ల బ్రెయిన్‌వాష్ కాకుండా చేయాలి: విజయ్ దేవరకొండ

టెర్రరిజం ఏ రూపంలో ఉన్నా మిగిల్చేది నష్టమేనని, పెహల్గాం లాంటి ఘటనలు ఇంకెప్పుడూ జరగకూడదని కథానాయకుడు సూర్య అన్నారు. ఆయన కీలక పాత్రలో కార్తిక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రెట్రో'. పూజా హెగ్డే కథానాయిక. మే 1న, తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో మరో కథానాయకుడు విజయ్ దేవరకొండ, దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత నాగవంశీ తదితరులు పాల్గొన్నారు.

**కశ్మీర్ ఇండియాదే.. కశ్మీరీలు మనవాళ్లే!**

ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "పహల్గాంలో జరిగిన ఘటన ఎంతో బాధాకరం. మీ బాధను దగ్గరుండి పంచుకోలేకపోయినా, మేమూ దాన్ని అనుభవిస్తున్నాం. బాధితులకు అండగా నిలబడతాం. కశ్మీర్‌లో జరుగుతున్న దురాగతాలకు కారణం చదువు లేకపోవడమే. వాళ్లందరికీ చదువు చెప్పించి, బ్రెయిన్‌వాష్ కాకుండా ఉండేలా శిక్షణ ఇవ్వాలి. ఇలాంటి చర్యల వల్ల ఏం సాధిస్తారో తెలియదు. కశ్మీర్ ఇండియాదే. కశ్మీరీలు మనవాళ్లే. నేను రెండేళ్ల కిందట అక్కడ షూటింగ్‌కు వెళ్లా. చాలా బాగా చూసుకున్నారు. పాకిస్థాన్‌లో నీళ్లు, కరెంట్ లేక ఇబ్బంది పడుతుంటే, వాటి సంగతి చూసుకోకుండా ఇక్కడకు వచ్చి ఏం చేయాలనుకుంటున్నారో అర్థం కావటం లేదు. పాకిస్థాన్‌పై ఇండియా దాడి చేయాల్సిన అవసరం లేదు. కొన్ని రోజులు పోతే, ఆ దేశ ప్రజలే అక్కడి ప్రభుత్వంపై దాడి చేస్తారు. మనమంతా ఒక్కటిగా కలిసి ఉండాలి. ఎదుటి వ్యక్తిని ప్రేమించటం నేర్చుకోవాలి. మనం జీవితంలో ముందుకు వెళ్లాంటే అందుకు తాళం చెవి చదువు ఒక్కటే. మనం, మన తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నప్పుడే దేశం కూడా ముందుకు వెళ్తుంది"





# నాని ఏ చిత్రం చేసినా అది పక్కా హిట్టని ముందే అర్థమైపోతుంటుంది : రాజమౌళి

"చాలా మంది ఫ్రాంచైజీలు సృష్టిస్తుంటారు. అవి ఎన్ని రోజులుంటాయి.. ఎక్కడి దాకా వెళ్తాయి ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కానీ, శైలేశ్ 'హిట్: ఫస్ట్ కేస్' అని ప్రకటించగానే.. ఇది ఓ అనంతమైన ఫ్రాంచైజీలా ముందుకెళ్తూనే ఉంటుంది అందరికీ అర్థమైపోయింది. ఇది నిజంగా అలాగే కొనసాగాలని కోరుకుంటున్నా" అన్నారు దర్శకుడు రాజమౌళి. ఆయన ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన 'హిట్: ది థర్డ్ కేస్' చిత్ర విడుదల ముందస్తు వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాని కథానాయకుడిగా శైలేశ్ కొలను రూపొందించిన పాన్ ఇండియా చిత్రమిది. యునానిమస్ పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. ఈ సినిమా మే 1న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. "సాధారణంగా మా సినిమాలకు సంబంధించి ఏమైనా లీక్స్ వచ్చినప్పుడు నాకు చాలా కోపం వస్తుంటుంది. అయితే ఈ మధ్య 'హిట్ 3' ఇంటర్వ్యూ చూస్తున్నప్పుడు తన చిత్ర లీక్స్ గురించి శైలేశ్ ఎంతో పరిణతితో మాట్లాడిన తీరు నన్నెంతో ఆకట్టుకుంది. నిజానికి పోలీస్ కేసులకు అంతం లేదు. వాటితో ఎన్ని చిత్రాలైనా చేసుకుంటూ పోవచ్చు. ఈ 'హిట్' ఫ్రాంచైజీ అలా కొనసాగాలని కోరుకుంటున్నా. నాని ఏ చిత్రం చేసినా అది పక్కా హిట్టని ముందే అర్థమైపోతుంటుంది.

కానీ, ఆ తర్వాత తన నుంచి ఇంత కన్నా ఎక్కువ రావాలని కోరుకుంటుంటా. గతంలో నేను ఊహించిన దాని కన్నా నాని ఇప్పుడు చాలా ముందుకెళ్లిపోయాడు. కానీ, ఇప్పటికీ నా ఆశైతే తీరదు. తనింకా పైకి ఎదగాలని కోరుకుంటున్నా. కచ్చితంగా ఇది సూపర్ డూపర్ హిట్టవుతుందన్న సంకేతాలు అందుతున్నాయి" అన్నారు. ఈ సందర్భంగా "మహాభారతం'లో నాని ఉంటారా?" అని వ్యాఖ్యాత సుమ రాజమౌళిని ప్రశ్నించగా.. 'కచ్చితంగా.. నాని ఉంటాడన్నది పక్కా" అని బదులిచ్చారు.

# హిట్టు జోడీ.. రెండోసారి



కథానాయకుడు శర్వానంద్ తన తొలి పాన్ ఇండియా చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాని కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇందులో శర్వాకు జోడీగా అనుపమ పరమేశ్వరన్ నటించనుంది. ఈ విషయాన్ని చిత్రబృందం శనివారం ప్రకటించింది. 'శతమానం భవతి' తర్వాత శర్వా – అనుపమ కలిసి నటించనున్న రెండో చిత్రమిది. ఇది 1960ల కాలం నాటి ఉత్తర తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగే కథగా ఉంటుంది. ఈ కథకు తగ్గట్లుగానే దీంట్లో అనుపమ మునుపెన్నడూ చూడని రీతిలో రగ్గడ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించనుంది. దీంట్లో ఆమె పాత్ర కథకు బలాన్ని చేకూర్చేలా ఉండనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఇక ఈ సినిమా కోసం శర్వానంద్ ఇది వరకెన్నడూ చూడని విధంగా సరికొత్తగా మేకోవర్ అయ్యారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

# డ్రగ్స్ కేసు.. ఇద్దరు దర్శకుల అరెస్ట్



మాదకద్రవ్యాల వినియోగం ఆరోపణలతో మలయాళ చిత్రపరిశ్రమ కొన్నిరోజులుగా వార్తల్లో నిలుస్తోంది. డ్రగ్స్ తీసుకుంటున్నారనే ఆరోపణలతో ఇప్పటికే నటుడు షైన్ టామ్ చాకో అరెస్టైన విషయం తెలిసిందే. తాజాగా ఇదే పరిశ్రమకు చెందిన మరో ఇద్దరు దర్శకులను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. దర్శకులు ఖలీద్ రెహమాన్, అష్రఫ్ హంజాతోపాటు వారి స్నేహితుడు షలీఫ్‌ను కొచ్చిన్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. దర్శకుల అపార్ట్‌మెంట్‌లో శనివారం అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. కొద్ది మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేశారు.



# 'ఇతడు ఎన్నో బాయ్‌ఫ్రెండ్' అని అడిగేవారు

నటి శ్రుతిహాసన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకున్నారు. తల్లిదండ్రుల విడాకులు, కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న అవమానాలతోపాటు రిలేషన్‌షిప్ గురించీ మాట్లాడారు. తన గత ప్రేమ కథలను బహిర్గతం చేశారు. సరైన ప్రేమను పొందడంలో తాను ఎన్నోసార్లు విఫలమయ్యానని చెప్పారు.

"జీవితంలో ఇలాంటి పని ఎందుకు చేశానా.. అని బాధపడిన సందర్భాలు పెద్దగా ఏమీ లేవు. కానీ, నాకెంతో ఇష్టమైన వారిని కొన్నిసార్లు బాధపెట్టాను. అనుకోకుండా అది జరిగినప్పటికీ.. అలా చేయకుండా ఉండాల్సిందనే భావన ఎప్పటికీ ఉంటుంది. జీవితాంతం వారికి క్షమాపణలు చెబుతూనే ఉంటా. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఒక విఫల ప్రేమగాథ ఉంటుంది. మాజీ భాగస్వామి వల్ల మనం ఎన్నో విషయాలు అర్థం చేసుకుంటాం. నాక్కూడా అలాంటి బ్రేకప్ స్టోరీలు ఉన్నాయి. బ్రేకప్ అయ్యాక దాని గురించి ఎక్కువగా ఆలోచించకుండా ఉంటా. నా లవ్‌స్టోరీలను ఉద్దేశించి చాలామంది మాట్లాడుతుంటారు. 'ఇతడు ఎన్నో బాయ్‌ఫ్రెండ్?' అని అడుగుతుంటారు. వాళ్లకు అర్థం కాని విషయం ఏమిటంటే.. వారి దృష్టిలో అది కేవలం నంబర్ మాత్రమే.. కానీ, నాకు అలా కాదు. నేను కోరుకున్న ప్రేమను పొందడంలో అన్నిసార్లు విఫలమవుతున్నానని అర్థం. అది నన్ను బాధ పెడుతుంది. ఎందుకంటే నేనూ మనిషినే కదా" అని శ్రుతి హాసన్ చెప్పారు. బ్రేకప్ అయినంత మాత్రాన ఆ వ్యక్తిని తాను తప్పుపట్టనని చెప్పారు. మనిషి మారడం సహజమన్నారు.

# త్రీడీలో జగదేకవీరుడు అతిలోకసుందరి




ఈ మధ్య తెలుగులో రీ–రిలీజ్ సినిమాల హవా రెట్టింపయ్యింది. పాత క్లాసిక్ హిట్‌లను 4కె టెక్నాలజీతో కొత్తగా ముస్తాబు చేసి తిరిగి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాయి ఆయా చిత్ర బృందాలు. ఇప్పుడీ కోవలోనే కొత్తగా 'జగదేకవీరుడు అతిలోకసుందరి' త్రీడీ సొబగులద్దుకుని సినీప్రియుల్ని మురిపించేందుకు సిద్ధమవుతోంది. కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు రాఘవేంద్రరావు కలయికలో వైజయంతీ మూవీస్ నిర్మించిన క్లాసిక్ చిత్రమిది. శ్రీదేవి కథానాయిక. మే 9వ తేదీతో ఈ సినిమా విడుదలై 35ఏళ్లు పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో మరోసారి అదే తేదీకి ఈ చిత్రాన్ని 2డీతో పాటు 3డీ వెర్షన్‌లో విడుదల చేసేందుకు చిత్ర వర్గాలు సిద్ధమయ్యాయి. ఈ విషయాన్ని వైజయంతీ సంస్థ సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఓ చక్కటి సోషియో ఫాంటసీ కథతో భారీ విజువల్ వండర్‌లా ముస్తాబైన ఈ సినిమా అప్పట్లో బాక్సాఫీస్ ముందు భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడిది ఇన్నేళ్ల తర్వాత త్రీడీలో రానుండటం ప్రేక్షకుల్లో ఆసక్తిరేకెత్తిస్తోంది.

# నవ్విస్తూ.. భయపెడుతూ

'శుభం'తో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఇది ఆమె సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి సినిమా. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో కనిపించిన సన్నివేశాల్ని బట్టి.. ఇది వినోదం నిండిన హారర్ థ్రిల్లర్‌గా ముస్తాబైనట్లు అర్థమవుతోంది. ఓ ఊర్లోని మహిళలంతా ఒక సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తించడం.. వాళ్ల బారి నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు ఆ ఊర్లోని మగవాళ్లంతా అష్టకష్టాలు పడటం.. ఆఖర్లో సమంత మాతాజీగా ప్రత్యేక పాత్రలో కనిపించడం ట్రైలర్‌లో ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాకి సంగీతం: క్లింటన్ సెరెజో, నేపథ్య సంగీతం: వివేక్ సాగర్, ఛాయాగ్రహణం: మృదుల్ సుజిత్ సేన్.




# 'ఈడీ' విచారణ.. సమయం కోరిన మహేశ్‌బాబు



ప్రముఖ నటుడు మహేశ్‌బాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి లేఖ రాశారు. షూటింగ్ ఉన్నందున సోమవారం విచారణకు హాజరు కాలేకపోతున్నట్లు అందులో పేర్కొన్నారు. మరో తేదీ కేటాయించాలని ఈడీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సాయిసూర్య డెవలపర్స్, సురానా ప్రాజెక్టు కేసుల్లో కొన్ని రోజుల క్రితం మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ రెండు సంస్థలకు ఆయన ప్రచారకర్తగా ఉన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఇన్‌ఫ్లుయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,